PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 45 | విజయవాడ, గురువారం 14 సెప్టెంబర్ 2023 | 6 + 8 పేజీలు వెల : 5. 50

Vol No | Vijayawada, Thursday 14 September 2023 | Rs

20న ఎపి కేబినెట్ సమావేశం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఈ నెల 20న ఎపి కేబినెట్ సమావేశం జరగనున్నట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర సచివాలయంలో 20న మధ్యాహ్నం మూడు గంటలకు కేబినెట్ మీటింగ్ జరగనున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన జరిగే సమావేశానికి మంత్రులు, అధికారులు హాజరుకావాలన్నారు.

భారత్‌తో ఫైనల్లో తలపడేదెవరో !

- పాకిస్తాన్, శ్రీలంక జట్ల మధ్య నేడు కీలక పోరు
- వర్షంతో మ్యాచ్ రద్దయితే శ్రీలంకకు అవకాశం

6

అమూర్‌లో పుతిన్‌తో మాట్లాడుతున్న కిమ్

ఆధిపత్యవాదంపై పోరులో
రష్యాకు పూర్తి మద్దతు

- కిమ్ ఉద్ఘాటన
- రష్యన్ అంతరిక్ష ప్రయోగ కేంద్రం వద్ద ఇరువురు నేతల భేటీ

మాస్కో : అమెరికా, దాని మిత్రపక్షాల ఆధిపత్యవాదానికి వ్యతిరేకంగా రష్యా సల్పుతున్న పోరాటానికి తమ పూర్తి మద్దతు ఉంటుందని ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్ బుధవారం ఉద్ఘాటించారు. కిమ్ విదేశీ పర్యటనలు జరపడం చాలా అరుదు. రష్యాతో ద్వైపాక్షిక సంబంధాలను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లడమే తన పర్యటన ఉద్దేశమని కిమ్ తెలిపారు. రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో కలసి ఆయన రష్యన్ సుదూర తూర్పు ప్రాంతమైన అమూర్‌లోని రష్యన్ అంతరిక్ష రాకెట్ ప్రయోగ కేంద్రం (సోయజ్-2)ను సందర్శించారు. అనంతరం ఈ ఇరువురు నేతలు తమ ప్రతినిధి బృందాలతో కలసి గంటకు పైగా చర్చలు జరిపారు. ఆ తరువాత పుతిన్, కిమ్ ముఖాముఖి సమావేశం జరిగింది.. ఉభయ దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాల మెరుగుదల, సహకారం, ఆర్థిక, వాణిజ్య సంబంధాలు, సాంస్కృతిక మార్పిడి, ప్రాంతీయ, అంతర్జాతీయ అంశాలపై ఈ ఇరువురు నేతలు చర్చించినట్లు రష్యన్ అధ్యక్ష భవన ప్రతినిధి డిమిట్రి పెస్కోవ్ తెలిపారు. ఆధిపత్య శక్తులు సాగిస్తున్న దాడుల నుంచి తన దేశ సార్వభౌమత్వాన్ని, భద్రతను పరిరక్షించుకోవడం కోసం రష్యా పోరాడుతోందని ఉక్రెయిన్ యుద్ధాన్ని దృష్టిలో ఉంచుకుని కిమ్ వ్యాఖ్యానించారు. తనను రష్యా పర్యటనకు ఆహ్వానించినందుకుగాను పుతిన్‌కు తన తరపున, తన దేశం తరపున కిమ్ కృతజ్ఞతలు తెలియజేశారు. రష్యాతో మైత్రీబంధాన్ని మరింత బలోపేతం చేసుకునేందుకు తాము అత్యంత ప్రాధాన్యతనిస్తామని కిమ్ తెలిపారు. అంతరిక్ష పరిశ్రమ రంగంలో రష్యా సహకారాన్ని ఉత్తర కొరియా నేత కోరారు. కిమ్ రష్యా పర్యటనకు బయల్దేరడానికి ముందు అమెరికా అధ్యక్షుడు బైడెన్ ఒక ప్రకటన చేస్తూ రష్యాకు ఉత్తర కొరియా ఆయుధాలు సరఫరా చేస్తే సహించేది లేదని హూంకరించారు. ఆ వెంటనే ఆయుధాలు అమ్ముకోవడానికే కిమ్ పర్యటన ఉద్దేశించబడిందని పాశ్చాత్య మీడియా ప్రచారం అందుకుంది. దక్షిణ కొరియాతో సంధి కుదిరి 70 ఏళ్లు అయిన సందర్భంగా ప్యాంగ్యాంగ్‌లో మొన్న జులైలో జరిగిన కార్యక్రమానికి రష్యన్ రక్షణ మంత్రి సెర్గీ షోయిగు హాజరయ్యారు.

75 లక్షల ఉచిత గ్యాస్ కనెక్షన్లు

- రూ.7,210 కోట్లతో ఈ-కోర్టు ప్రాజెక్టు
- కేంద్ర మంత్రి వర్గం ఆమోదం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

వచ్చే మూడేళ్ళలో కొత్తగా 75 లక్షల ఉచిత గ్యాస్ కనెక్షన్లు ఇచ్చేందుకు కేంద్ర మంత్రివర్గం ఆమోదించింది. రూ.7,210 కోట్లతో ఈ-కోర్టు ప్రాజెక్టు మూడో దశ వంటి పలు నిర్ణయాలను కేంద్ర మంత్రి వర్గం ఆమోదించింది. బుధవారం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన కేంద్ర మంత్రివర్గం సమావేశం జరిగింది. అనంతరం మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న పలు నిర్ణయాలను కేంద్ర మంత్రి అనురాగ్ ఠాగూర్ మీడియాకు వెల్లడించారు. మెసర్స్ సువెన్ ఫార్మాస్యూటికల్స్ లిమిటెడ్‌లో రూ.9,589 కోట్ల వరకు విదేశీ పెట్టుబడులకు సంబంధించిన అందిన ప్రతిపాదనకు ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన జరిగిన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ ఆమోదం తెలిపింది.

రూ.7,210 కోట్లతో ఈ-కోర్ట్స్ మిషన్ మోడ్ ప్రాజెక్టు మూడో దశకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిందన్నారు. న్యాయ వ్యవస్థలో మరింత పారదర్శకత, కాగిత రహిత కార్యకలాపాల కోసం రూపొందించిన ఈ-కోర్టులను వచ్చే నాలుగేళ్లలో అమలు చేస్తామని పేర్కొన్నారు. ఈ ఫైలింగ్, ఈ పేమెంట్ వ్యవస్థకు ఉపయుక్తంగా ఉండే కోర్టు కాంప్లెక్సుల్లో 4,400 ఈ-సర్వీసు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. రూ.1,650 కోట్లతో మరో 75 లక్షల గ్యాస్ సిలిండర్లు ఉచితంగా పంపిణీ చేయాలని కేంద్ర మంత్రివర్గం నిర్ణయించిందని అన్నారు. ఉజ్వల యోజనకు అదనంగా మూడేళ్ల వీటిని పంపిణీ చేస్తామని తెలిపిందన్నారు. జీ20 శిఖరాగ్ర సదస్సును విజయవంతం చేసినందుకుగాను యావత్ దేశ ప్రజల తరపున ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి అభినందనలు తెలుపుతూ చేసిన ఓ తీర్మానానికి కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది.

ఆగని స్కిల్ ప్రకంపనలు

- హైకోర్టులో ప్రారంభమైన విచారణ
- 18 తరువాతే ఎసిబికోర్టులో కస్టడి పిటిషన్‌పై వాదనలు
- కత్తియుద్ధం తప్పదంటూ బాబు లాయర్ లూథ్రా ట్వీట్
- నా మిత్రుడు తప్పు చేయడు : రజనీకాంత్

'బాబుతో నేను' : టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు అరెస్టును నిరసిస్తూ సంతకాల సేకరణ కార్యాక్రమాన్ని ప్రారంభిస్తున్న ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు, పొలిట్‌బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణ తదితరులు

- వార్తలు 2లో

ప్రజాశక్తి - యంత్రాంగం

తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడును సిఐడి అరెస్ట్ చేసి ఐదు రోజులు దాటుతున్నా ఆ ప్రకంపనలు కొనసాగుతున్నాయి. బుధవారం నాడు కూడా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ స్కామ్ కేంద్రంగానే రాష్ట్రంలో కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. చంద్రబాబును అక్రమంగా అరెస్ట్ చేశారంటూ రాష్ట్రవ్యాప్తంగా టిడిపి నేతలు, కార్యకర్తల ఆందోళనలు కొనసాగాయి. అనేకచోట్ల టిడిపి నేతలను పోలీసులు అరెస్ట్‌లు చేశారు. వైసిపి నాయకుల ప్రతి విమర్శలూ ఆగలేదు.ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి వరుసగా రెండవ రోజు కూడా దర్యాప్తుల పురోగతి, కోర్టుల్లో విచారణ జరుగుతున్న తీరు గురించి ఆరా తీసినట్లు తెలిసింది.

మరోవైపు రిమాండ్ పిటిషన్‌ను కొట్టి వేయాలంటూ చంద్రబాబునాయుడు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ ప్రారంభమైంది. కౌంటర్ దాఖలకు సమయం కావాలని ప్రభుత్వ న్యాయవాదులు కోరడంతో అంగీకరించిన న్యాయమూర్తి 18 వ తేది వరకు విచారణను వాయిదా వేశారు. అప్పటి వరకు కస్టడి పిటిషన్‌ను విచారించవద్దని ఎసిబి కోర్టును ఆదేశించారు. హైకోర్టులో విచారణ వాయిదా పడిన తరువాత చంద్రబాబు తరపున

మిగతా 5లో

13 చోట్ల బాబు సంతకం : సిఐడి చీఫ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కేసులో చంద్రబాబునాయుడు ప్రమేయం నేరుగా వున్నందునే కేసులో ఎ37 నుండి ఎ1గా మార్చామని సిఐడి చీఫ్ ఎన్ సంజయ్ పేర్కొన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు నిధుల కేటాయింపుకు సంబంధించి అధికారులు అభ్యంతరాలను తోసిపుచ్చుతూ చంద్రబాబు అనుమతులు ఇచ్చారని, ఇందుకు గాను 13 చోట్ల ఆయన సంతకాలను గుర్తించినట్లు తెలిపారు. బుధవారం రాష్ట్ర సచివాలయంలోని పబ్లిసిటి సెల్‌లో ఆయన సిఐడి ఎస్‌పి కె ఫకీరప్పతో కలిసి మీడియాతో మాట్లాడారు. కేబినెట్ అనుమతి లేకుండా స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఏర్పాటు చేశారని అన్నారు. కార్పొరేషన్ ఏర్పాటులో విధి విధినాలను ఎక్కడా పాటించలేదని అన్నారు. ప్రైవేట్ వ్యక్తి గంటా సుబ్బారావుకు నాలుగు పదవులు కట్టబెట్టి వ్యవహారాన్ని నడిపారని అన్నారు. నేరుగా ఈ డిపార్ట్‌మెంట్ చంద్రబాబునాయుడే సంప్రదించేలా ప్లాన్ చేశారని అన్నారు. జీఓల్లో 13 చోట్ల చంద్రబాబు నాయుడు స్వహస్తాలతో చేసిన సంతకాలున్నాయని అన్నారు. బడ్జెట్ అనుమతి, కౌన్సిల్ సమావేశానికి కూడా చంద్రబాబునాయుడు సంతకం వుందన్నారు. సిమెన్స్‌ను తెచ్చి స్కిల్ సెంటర్లు పెట్టాలన్నది ఎంఓయులో లేదన్నారు. అగ్రిమెంట్ దురుద్దేశపూర్వకంగా చేసుకున్నారని తెలిపారు. స్కిల్ కార్పొరేషన్‌కు రూ 371 కోట్లు విడుదల చేశారని అందులో సీమెన్స్ కంపెనీకి సాఫ్ట్‌వేర్ కోసం రూ 58కోట్లు ఇచ్చారన్నారు. మిగిలిన రూ 313 కోట్లలో రూ 241 కోట్లకు డిజిటెక్ కంపెనీ వద్ద అసలు లెక్కలే లేవన్నారు. ఆ డబ్బును షెల్ కంపెనీలకు దారి మళ్లించారని అన్నారు. ఈ కార్పొరేషన్‌కు తెలుగుదేశం పార్టీకి చెందిన జె వెంకటేశ్వర్లును ఆడిటర్‌గా పెట్టుకున్నారని అన్నారు. జీఓను తుంగలో తొక్కి అగ్రిమెంట్ చేసుకున్నారని అన్నారు. ఈ కేసులో డిజిటెక్ ప్రతినిధిని అరెస్ట్ చేయడంతో పాటు అతనికి చెందిన రూ 32 కోట్లను ఈడి అటాచ్ చేసిందన్నారు. సిఎం, సిఎస్ చెప్పడం వల్లనే నిధులు విడుదల చేశామని అప్పటి ఆర్థిక కార్యదర్శి పివి రమేష్ స్టేట్‌మెంట్ ఇచ్చారన్నారు. ఈ కేసులో అచ్చెన్నాయుడు సంతకాలు కూడా ఐదు చోట్ల గుర్తించామని విచారణ చేస్తున్నామని తెలిపారు.

'వడ్డీ' భారం మోపొద్దు

- ఇపిడిసిఎల్ పిటిషన్‌ను తిరస్కరించాలి
- ఎపిఇఆర్‌సి విచారణలో విద్యుత్ రంగ నిపుణులు వేణుగోపాల్‌రావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యుత్ వినియోగదారులపై భారాలు మోపొద్దని విద్యుత్ రంగ నిపుణులు ఎం వేణుగోపాల్‌రావు కోరారు. ఇప్పటికే డిస్కమ్‌లు అనేక భారాలను వినియోగదారులపై వేసిందని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యుత్ కొనుగోళ్ల వర్కింగ్ క్యాపిటల్ పేరుతో వినియోగదారుల నుంచి రూ.650 కోట్ల వడ్డీ వసూలు చేసుకునేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ తూర్పు విద్యుత్ పంపిణీ సంస్థ (ఎపిఇపిడిసిఎల్) ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఎపిఇఆర్‌సి)లో పిటిషన్ వేసింది. దీనిపై హైదరాబాద్‌లోని ఇఆర్‌సి కార్యాలయంలో ఛైర్మన్ జస్టిస్ నాగార్జున రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం విచారణ జరిగింది. వేణుగోపాల్‌రావు అభ్యంతరాలపై డిస్కం ఇచ్చిన సమాధానంపై ఆయన మాట్లాడారు. విద్యుత్ కొనుగోళ్లలో వర్కింగ్ క్యాపిటల్ వడ్డీ పేరుతో సుమారు రూ.1500 కోట్ల నుంచి రూ.2 వేల కోట్ల భారం ప్రజలపై డిస్కమ్‌లు మోపుతున్నాయని అన్నారు. కేవలం ఇపిడిసిఎల్ రూ.650 కోట్లు ప్రతిపాదించిందని, ఇంకా ఎస్‌పిడిసిఎల్, సిపిడిసిఎల్ కూడా ప్రతిపాదించే అవకాశం ఉందని అన్నారు. వినియోగదారులు బిల్లు చెల్లించడం ఆలస్యమైతే డిస్కమ్‌లు వడ్డీ వసూలు చేస్తున్నాయని, కనెక్షన్ మరలా ఇచ్చినా ఫీజులు వసూలు చేస్తున్నాయని వివరించారు. బిల్లులు 90 శాతం సకాలంలో వసూలవుతున్నాయని డిస్కమ్‌లే చెబుతున్నాయని మరి వడ్డీ ఎందుకని ప్రశ్నించారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలను వసూలు చేయకలేపోవడంలో డిస్కమ్‌లు వైఫల్యం చెందుతున్నాయని విమర్శించారు. 2018-19 నుంచి 2021-2022 వరకు రాష్ట్ర ప్రభుత్వం రూ.2,650 కోట్ల టారిఫ్ సబ్సిడీ, ప్రభుత్వం, స్థానిక సంస్థల నుంచి రూ.3,563.58 కోట్ల బకాయిలు ఇపిడిసిఎల్‌కు పేరుకుపోయాయని చెప్పారు. చెల్లించకపోవడం ప్రభుత్వ వైఫల్యమని అన్నారు. డిస్కమ్‌లు, ప్రభుత్వ వైఫల్యాలను వినియోగదారులపై నెట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఈ ప్రతిపాదనను ఇఆర్‌సి అనుమతినిస్తే డిస్కమ్‌ల వైఫల్యం, అసమర్థతను ప్రోత్సహించినట్లే అని చెప్పారు. కమిషన్ అనుమతి ఇచ్చిన దానికంటే విద్యుత్ తక్కువ కొనుగోళ్లు డిస్కం చేసిందన్నారు. అలాంటప్పుడు మరలా విద్యుత్ కొనుగోలుపై వర్కింగ్ క్యాపిటల్‌పై వడ్డీ ఏమిటని ప్రశ్నించారు.

ఈ ప్రతిపాదనను తిరస్కరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం సకాలంలో బిల్లులు చెల్లించకపోతే డిస్కమ్‌లు ఎలా నడుస్తాయని పారిశ్రామిక వేత్త విజయ్‌గోపాల్ రెడ్డి అన్నారు. వడ్డీ వసూలు కోసం ఇపిడిసిఎల్ వేసిన పిటిషన్‌ను తిరస్కరించాలని సిపిఎం రాష్ట్ర కమిటీ తరపున ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు కూడా ఇఆర్‌సికి లేఖ రాశారు.



ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ రూపొందించిన బ్రోచర్‌ను విడుదల చేస్తున్న సిఎం జగన్మోహన్‌రెడ్డి

30 నుండి జగనన్న ఆరోగ్య సురక్ష

- బ్రోచర్ విడుదల చేసిన సిఎం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఈనెల 30న ప్రారంభించనున్నట్లు సిఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తెలిపారు. జగనన్న ఆరోగ్య సురక్షపై బుధవారం క్యాంపు కార్యాలయం నుంచి జిల్లాల కలెక్టర్లతో సిఎం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ పథకం కింద ఉచితంగా వైద్యం పొందడం ఎలా అనే అంశంపై ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ రూపొందించిన బ్రోచర్‌ను సిఎం విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జగనన్న సురక్ష తరహాలోనే ప్రతి ఇంటికి వెళ్లి ఆరోగ్య సమస్యలు తెలుసుకోవాలన్నారు. దీనికోసం ప్రతి ఇంటిని జల్లెడ పట్టాలని చెప్పారు. గుర్తించిన బాధితులందరికీ ఒక రోజు గ్రామంలో హెల్త్ క్యాంప్ నిర్వహించి అవసరమైన వారికి పరీక్షలు చేయడంతో పాటు మందులు, కళ్లద్దాలు ఇవ్వాలన్నారు. సురక్షలో ఏరకంగా 98లక్షలకు పైగా సర్టిఫికెట్లు నెల రోజుల వ్యవధిలో అందించామో అదే తరహాలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. జల్లెడ పట్టిన ప్రతి గ్రామాన్ని ఫ్యామిలీ డాక్టర్ పూర్తిగా బాధ్యత తీసుకొవాలని చెప్పారు. ఆ గ్రామాన్ని మ్యాపింగ్ చేసి ప్రతి ఇంట్లో ఏ సమస్యలున్నాయనేది తెలుసుకుని విలేజ్ క్లినిక్ ద్వారా వాటిని పరిష్కరిస్తారని తెలిపారు. అనంతరం ఆ గ్రామంలో ప్రతి ఇంట్లో ఎవరికి ఏ రకమైన మందులు కావాలి? ఎలాంటి ట్రీట్‌మెంట్ జరగాలి అనే అంశంపై అధికారులు దృష్టి పెట్టాలన్నారు. పెరాలసిస్, మరేదైనా సమస్య ఉంటే వారికి రెగ్యులర్ మెడిసిన్ ఇవ్వడంతో పాటు వైద్యుడు వారిని పరీక్షించి తదుపరి చికిత్స అందించే కార్యక్రమం కూడా నిర్వహించాలన్నారు. నాలుగేళ్ల కాలంలో వైద్యారోగ్యశాఖలో 53,126 పోస్టుల భర్తీ చేశామని అన్ని ఆసుపత్రులను జాతీయస్థాయి ప్రమాణాలతో

మిగతా 2లో

అప్పు చెల్లించిన తర్వాత..

నెల రోజుల్లో ఆస్తి పత్రాలు ఇవ్వాల్సిందే

- లేదంటే రోజుకు రూ.5వేల జరిమానా
- రుణదాతలకు ఆర్‌బిఐ మార్గదర్శకాలు

లోపలి పేజీలో.!

జన్యు పరిరక్షణ ప్రయోగం విజయవంతం

- పిండ గర్భధారణ ప్రక్రియ ద్వారా ఒంగోలు జాతి కోడెదూడ జననం

కేరళలో పెరుగుతున్న నిపా కేసులు

తిరువనంతపురం: కేరళలో నిపా వైరస్ కేసులు పెరుగుతున్నాయి. రాష్ట్రంలో మరో నలుగురికి నిపా వైరస్ నిర్ధారణ అయింది. రాష్ట్రంలో ఇప్పటికే ఈ వైరస్‌తో ఇద్దరు మృతిచెందినట్లు కేంద్రం ప్రకటించిన సంగతి తెలిసిందే. వీరిలో ఒక మృతుడి బంధువులకు పరీక్షలు నిర్వహించగా, నలుగురికి నిపా వైరస్ సోకినట్లు నిర్ధారణ అయింది. మొత్తంగా మృతులకు సన్నిహితంగా మెలిగిన 130మందిని గుర్తించి పరీక్షించినట్లు సమాచారం. నిపా వైరస్ కేసుల పెరుగుదలతో కేరళ మరోసారి అప్రమత్తమైంది. వైరస్ కట్టడి చర్యలకు ఉపక్రమించిన అధికారులు. కోజికోడ్ జిల్లాలోని 7 గ్రామాలను కంటైన్మెంట్ జోన్లుగా ప్రకటించారు. ముందు జాగ్రత్తగా అక్కడి బ్యాంకులు, విద్యాసంస్థలను మూసివేశారు. రాష్ట్రంలో నిపా కేసులు వెలుగు చూడటంపై ఆ రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి వీణాజార్జ్ స్పందించారు. రాష్ట్రంలో ప్రస్తుతం బయటపడిన నిపా కేసు బంగ్లాదేశ్ వేరియంట్ అని పేర్కొన్నారు. ఇది మనుషుల మధ్య వ్యాపించగలదని, వ్యాప్తి తక్కువగా ఉన్నప్పటికీ మరణాల రేటు అధికమని చెప్పారు. మెదడును అత్యంత తీవ్రంగా దెబ్బతీసే నిపా వైరస్‌ను 1999లో తొలిసారి గుర్తించారు. మలేసియా, సింగపూర్‌లోని పందుల పెంపకందారుల్లో ఈ ఇన్‌ఫెక్షన్‌ను కనుగొన్నారు. కేరళలో ఈ వైరస్ 2018లో తొలిసారి వెలుగు చూసింది.

విద్యుత్ ఛార్జీల మోతపై
రాష్ట్ర వ్యాపిత ఉద్యమం

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పిలుపు

ప్రజాశక్తి -తిరువూరు

ఎడాపెడా విధిస్తున్న విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాపిత ఉద్యమానికి సిద్ధం కావాలని సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఎన్‌టిఆర్ జిల్లా తిరువూరులో ఆయన బుధవారం మీడియాతో మాట్లాడుతూ, ట్రూ అప్ ఛార్జీలు, ఇతర ఛార్జీల పేరుతో భారీగా పెరిగిన విద్యుత్ బిల్లులతో ప్రజలు అల్లాడుతున్నారని, ఈ భారాలకు వ్యతిరేకంగా అందరిని కలుపుకుని ఉద్యమించేందుకు సిపిఎం కృషి చేస్తుందని అన్నారు. రాష్ట్ర సచివాలయం పంటి ప్రభుత్వ కార్యాలయాల్లో సర్కార్ చెల్లించాల్సిన విద్యుత్ బిల్లుల మీద వేసే వడ్డీని కూడా ట్రూ ఆఫ్ చార్జీల పేరుతో ప్రజల నుండి పిండుకోవడం దుర్మార్గమని శ్రీనివాసరావు విమర్శించారు.. గహ వినియోగ దారులతో పాటు చిన్నచిన్న పరిశ్రమలు కూడా పెరిగిన విద్యుత్ ఛార్జీలను భరించలేకపోతున్నాయని, దీంతో పరిశ్రమలు మూతపడుతున్నాయని ఆయన పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆదాని కంపె నీకి స్మార్ట్ మీటర్లను కాంట్రాక్ట్ ఇచ్చిందని, కాబట్టి అదానీకి లాభం చేకూర్చడం కోసమే ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లను రాష్ట్ర ప్రభుత్వం ఇక్కడ ప్రజలపై రుద్దుతోందని అన్నారు...

ఆ తరువాత జరిగిన ఒక సదస్సులో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో తీవ్రమైన వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని, ప్రభుత్వం ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించి రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. 400 మండలాల్లో వార్షాభావ పరి స్థితులు నెలకొన్నాయని, ప్రత్యామ్నాయ పంటల సాగుకు కౌలు రైతులకు కూడా ఇన్ పుట్ సబ్సిడీ వర్తింపచేయాలన్నారు.. అక్టోబర్ నుండి నవంబర్ 7 వరకు సిపిఎం ప్రత్యామ్నాయ రాజకీయ విధానంపై ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్ల డించారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఒకే విధానపరమైన రాజకీయం కొనసాగుతుందని, దేశానికి ప్రమాదకరంగా మారిన బిజెపి యెడల అధికార వైసిపి, ప్రతిపక్ష టీడీపీ, జనసేనాలు అనుకూలంగా ఉన్నాయని, కానీ రాష్ట్రంలో ఒకరిపై ఒకరు దుమ్మెత్తి పోసుకుంటూ ప్రజలను పక్క దారి పట్టిస్తున్నాయని ఆయన దుయ్యబట్టారు. సిపిఎం సూత్రబద్ధమైన రాజకీయ వైఖరితో స్పష్టంగా ఉందని, బిజెపికి వ్యతిరేకంగా ఉన్న పార్టీలతో కలిసి పనిచేస్తామని శ్రీనివాసరావు వెల్లడించారు. ఈ సదస్సుకు సిపిఎం తిరువూరు పట్టణ కార్యదర్శి మేకల నాగేంద్ర ప్రసాద్ అధ్యక్షత వహించారు. ఆ పార్టీ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి డివి.కృష్ణ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కోట కళ్యాణ్, పగడాల వీరాంజనేయులు, సీనియర్ నాయకులు సాని కొమ్ము నాగేశ్వరరెడ్డి, గుల్లపల్లి వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

న్యూఢిల్లీలోని శరద్ పవార్ నివాసంలో సమావేశమైన ఇండియా ఫోరం నేతలు

భోపాల్‌లో 'ఇండియా' భారీ ర్యాలీ

- ప్రతిపక్షాల ఫోరం సమన్వయ కమిటీ తొలి భేటీలో నిర్ణయం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

పెరుగుతున్న ధరలు, నిరుద్యోగం, బిజెపి ప్రభుత్వ అవినీతిపై అక్టోబర్ మొదటి వారంలో మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో తొలి బహిరంగ సభ జరిపేందుకు ప్రతిపక్షాల ఇండియా ఫోరం సమన్వయ కమిటీ నిర్ణయించింది. బుధవారం నాడిక్కడ ఎన్సిపి అధినేత శరద్ పవార్ నివాసంలో ఇండియా ఫోరం సమన్వయ కమిటీ మొదటి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో 12 పార్టీల నుంచి శరద్ పవార్ (ఎన్సిపి), డి.రాజా (సిపిఐ), హేమంత్ సోరెన్ (జెఎంఎం), కెసి వేణుగోపాల్ (కాంగ్రెస్), టిఆర్ బాలు (డిఎంకె), తేజస్వి యాదవ్ (ఆర్జెడి), సంజయ్ రౌత్ (శివసేన), సంజయ్ ఝా (జెడియు), జావెద్ అలీ (ఎస్పి), రాఘవ్ చడ్డా (ఆప్), ఒమర్ అబ్దుల్లా (నేషనల్ కాన్ఫరెన్స్), మెహబూబా ముఫ్తి (పిడిపి) నేతలు పాల్గొన్నారు. బిజెపి, ప్రధానమంత్రి ప్రతీకార రాజకీయాల కారణంగా ఈడి సమన్ల వల్ల టిఎంసి నేత అభిషేక్ బెనర్జీ, ఇతర వల్ల జెడియు నేత లలన్ సింగ్ హాజరుకాలేదు.

సమావేశం అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నేతలందరతో కలిసి కాంగ్రెస్ నేత కెసి వేణుగోపాల్ మాట్లాడుతూ సీట్ల పంపకానికి సంబంధించిన ప్రక్రియను ప్రారంభించాలని సమన్వయ కమిటీ నిర్ణయించిందన్నారు. పార్టీలతో చర్చలు జరిపి వీలైనంత త్వరగా నిర్ణయం తీసుకోవాలని నిర్ణయించినట్లు తెలిపారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఉమ్మడి బహిరంగ సభలు నిర్వహించాలని కమిటీ నిర్ణయించిందన్నారు. కూటమి పార్టీలు ఏవీ తమ ప్రతినిధులను మీడియా చర్చలకు పంపకూడదని, ఎవరి షోలలో ఎవరి పాల్గొనే ప్రతినిధుల పేర్లను నిర్ణయించే అధికారం మీడియా కో-ఆర్డినేషన్ కమిటీ సబ్ గ్రూప్ కు ఇచ్చినట్లు తెలిపారు.

పంచాయతీ కార్యదర్శులకు అధికారాలు కల్పించాలి

- ఎంప్లాయీస్ ఫెడరేషన్ వినతి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శులకు గ్రామ పంచాయతీ అధికారాలు కల్పించాలని గ్రామ, వార్డు సచివాలయ ఎంప్లాయీస్ ఫెడరేషన్ అధ్యక్షులు ఎమ్‌డి జానీ పాషా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం పంచాయతీరాజ్‌శాఖ మంత్రి బూడి ముత్యాలనాయుడును విజయవాడలో కలిసి వినతిపత్రం అందజేశారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

'ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్'పై కౌంటర్ దాఖలు చేయండి

- ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు

ప్రజాశక్తి-అమరావతి

రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ విధానం (కార్డ్ ప్రైమ్ 2.0)ను రద్దు చేయాలని దాఖలైన పిల్‌లో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. రిజిస్ట్రేషన్‌శాఖ ముఖ్య కార్యదర్శి, ఐజికు నోటీసులు జారీ చేసి విచారణను మూడు వారాలకు వాయిదా వేస్తూ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ ఆర్ రఘునందన్‌రావుతో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. కార్డ్ ప్రైమ్ 2.0 విధానాన్ని సవాల్ చేస్తూ వినుకొండ మాజీ ఎమ్మెల్యే జివి ఆంజనేయులు, కంకిపాడుకు చెందిన కొత్తపల్లి సీతారమప్రసాద్ వేర్వేరుగా పిల్స్ దాఖలు చేశారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ విధానం వల్ల చదువురానివారు నష్టపోతారని చెప్పారు. కౌంటర్ వేస్తామని ప్రభుత్వం చెప్పడంతో విచారణ వాయిదా పడింది.

ప్రతివాదులకు నోటీసులు

క్రిమినల్ కేసులున్న వారిని టిటిడి సభ్యులుగా నియమించడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన కేసులో కౌంటర్ పిటిషన్లు దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వంతోపాటు టిటిడిని హైకోర్టు ఆదేశించింది. ప్రతివాదులకు నోటీసులు జారీ చేసి విచారణను మూడు వారాలకు వాయిదా వేస్తూ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ ఆర్ రఘునందన్‌రావుతో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. క్రిమినల్ కేసులున్న జగ్గయ్యపేట ఎమ్మెల్యే సామినేని ఉదయభాను, ఢిల్లీ లిక్కర్ స్కాం నిందితుడు అరబిందో గ్రూప్ డైరెక్టరు పి శరత్‌చంద్రారెడ్డి, అవినీతి ఆరోపణల కేసులో మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఛైర్మన్ పదవిని కోల్పోయిన డాక్టర్ కేతన్ దేశాయ్‌ను టిటిడి సభ్యులుగా నియమించడాన్ని సవాల్ చేస్తూ విజయవాడకు చెందిన రిటైర్డు రైల్వే ఉద్యోగి చింతా వెంకటేశ్వర్లు పిల్ దాఖలు చేశారు. ప్రభుత్వం, టిటిడితోపాటు ఆ ముగ్గురికీ హైకోర్టు నోటీసులు జారీ చేసింది.

30 నుండి జగనన్న ఆరోగ్య సురక్ష

మొదటి పేజీ తరువాయి

అభివృద్ధి చేసినట్లు సిఎం వెల్లడించారు. వైద్యారోగ్యశాఖ పరిధిలో ఎక్కడైనా ఖాళీలుంటే మెడికల్ రిక్రూట్‌మెంట్ బోర్డు వాటిని తక్షణమే భర్తీ చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వైద్యారోగ్యశాఖ మంత్రి విడదల రజిని, సిఎస్ డాక్టర్ కెఎస్ జవహర్‌రెడ్డి, సిసిఎల్‌ఎ జి.సాయిప్రసాద్, వైద్యారోగ్యశాఖ స్పెషల్ సిఎస్ ఎమ్‌టి కృష్ణబాబు, మహిళా శిశు సంక్షేమ శాఖ కమిషనరు ఎ మ్ జానకి, సిసిఎల్‌ఎ కార్యదర్శి ఎండి ఇంతియాజ్, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ జె.నివాస్, ఆరోగ్యశ్రీ సిఇఒ హరేందర్ ప్రసాద్, ఆర్థిక శాఖ కార్యదర్శి ఎన్ గుల్జార్, గిరిజన సంక్షేమశాఖ డైరెక్టర్ వెంకట మురళీ, మునిసిపల్ అడ్మినిస్ట్రేటివ్ కమిషనరు పి.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

కేంద్ర పథకాల పేర్లు ఎలా మారుస్తారు?

- బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పురందేశ్వరి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కేంద్ర ప్రభుత్వ పథకాలకు రాష్ట్రంలో పేరు మార్చుకుని తమ పథకాలుగా ప్రచారం చేసుకుంటున్నారని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు దగ్గుబాటి పురందేశ్వరి ప్రశ్నించారు. విజయవాడలోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో బుధవారం మీడియా ఇన్‌ఛార్జి పాతూరి నాగభూషణం అధ్యక్షతన అధికార ప్రతినిధులు, మీడియా ఫ్యానలిస్టులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పురందేశ్వరి మాట్లాడుతూ.. జాతీయ రహదారుల నిర్మాణం, రైల్వేల అభివృద్ధి మోడీ ప్రభుత్వంలోనే జరిగిందన్న విషయాలు ప్రసార మాధ్యమాలు ద్వారా తీసుకెళ్లాలని దిశానిర్దేశం చేశారు.

కౌన్సిల్ సమావేశాల సందర్భంగా ఏర్పాటు చేసిన స్వాగత తోరణాలు

నేటి నుంచి నిర్మాణ కార్మికుల కౌన్సిల్ సమావేశాలు

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

అఖిల భారత భవన, ఇతర నిర్మాణ రంగ కార్మికుల సమాఖ్య (బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్స్ వర్కర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా) కౌన్సిల్ సమావేశాలు గురువారం నుంచి 4 రోజుల పాటు నెల్లూరులోని డాక్టర్ జెట్టి శేషారెడ్డి భవన్‌లో జరగనున్నాయి. ఇందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. తొలి రోజు ర్యాలీ, బహిరంగసభ, మిగతా మూడు రోజులు ప్రతినిధుల సభ జరగనుంది. అన్ని రాష్ట్రాల నుంచి 140 మంది సభ్యులు హాజరుకానున్నారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ఈ సమావేశాల్లో చర్చించనున్నారు. జాతీయ సమావేశాల సందర్భంగా నగరంలోని విఆర్‌సి, రామలింగాపురం, ముత్తుకూరు, చిల్డ్రన్స్‌పార్క్, అపోలో సెంటర్‌లో స్వాగత ఏర్పాట్లు చేశారు.

గురువారం మధ్యాహ్నం నాలుగు గంటలకు స్థానిక విఆర్‌సి గ్రౌండ్ నుంచి ర్యాలీ ప్రారంభవుతుంది. రామలింగాపురం సెంటర్ మీదుగా ముత్తుకూరు గేట్ వద్దకు చేరుకుంటుంది. అక్కడే బహిరంగ సభ నిర్వహించనున్నారు. ఈ సభలో సిడబ్ల్యుఎఫ్‌ఐ అధ్యక్షులు కె. హేమలత, ప్రధాన కార్యదర్శి యుపి జోసఫ్, ఉపాధ్యక్షులు ఎం.సాయిబాబు తదితరులు పాల్గొంటారు.

దీక్షలో కూర్చున్న జ్యోతీశ్వరరావు, మల్కాపురం జోన్ కార్మికులు

స్టీల్‌ప్లాంట్‌ను నిర్వీర్యం చేసే కుట్రలు తీవ్రం

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

రాష్ట్రాభివృద్ధిలో కీలకపాత్ర పోషించిన వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను అన్ని విధాలా నిర్వీర్యం చేసే కుట్రలు తీవ్రమవుతున్నాయని సిఐటియు విశాఖ జిల్లా కోశాధికారి ఎస్ జ్యోతీశ్వరరావు విమర్శించారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యాన చేపట్టిన రిలే దీక్షలు బుధవారానికి 893వ రోజుకు చేరాయి. దీక్షల్లో మల్కాపురం జోన్ కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి జ్యోతీశ్వరరావు మాట్లాడుతూ పరిశ్రమకు తగినంత బొగ్గు సరఫరా చేయకపోవడం, ఆర్థికంగా సహకరించకపోవడం ప్లాంట్‌ను నిర్వీర్యపరిచే కుట్రలో భాగమేనన్నారు. కార్మికులపై పని ఒత్తిడి పెంచారని, సౌకర్యాలు కల్పించడంలేదని, రిటైర్ అయిన ఉద్యోగులకు గ్రాట్యూటీ ఇవ్వడంలేదని తెలిపారు. ఇలాంటి చర్యలకు పాల్పడుతూ కార్మికులను ఇబ్బందులకు గురిచేయడం దారుణమన్నారు. కార్మికుల వేజ్ అగ్రిమెంట్‌ను చివరి దశలో ఉక్కు శాఖ మంత్రి ఆమోదించకపోవడంపై మండిపడ్డారు. లక్షలాది మందికి ఉపాధి కల్పిస్తున్న స్టీల్‌ప్లాంట్‌పై కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కక్షపూరిత చర్యలు మానుకోవాలని, ప్రయివేటీకరణ నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సొంత గనులు కేటాయించి, పూర్తి ఉత్పత్తి సామర్థ్యంతో నడపాలని కోరారు.

18 తరువాతే కస్టడీ పిటిషన్‌పై విచారణ

- ఎసిబి కోర్టుకు హైకోర్టు ఆదేశం
- క్వాష్ పిటిషన్ విచారణ 19కి వాయిదా

ప్రజాశక్తి-అమరావతి

ఎపి సిల్క్ డెవలప్‌మెంట్ సంస్థ (ఎపిఎస్ఎస్‌డిసి) నిధుల దుర్వినియోగం కేసులో సిఐడి నమోదు చేసిన కస్టడీ పిటిషన్‌పై విచారణను ఈ నెల 18వ తేది వరకు చేపట్టరాదని ఎసిబి కోర్టును హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు బుధవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈలోగా ప్రతివాదులైన మంగళగిరి సిఐడి ఎస్‌హెచ్ఒ, ఫిర్యాదుదారుడైన ఎపిఎస్-ఎస్‌డిసి ఛైర్మన్ కె అజయ్‌రెడ్డి తదితరులు తమ వాదనలతో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను ఈ నెల 19వ తేదీకి వాయిదా వేసింది. జస్టిస్ కె శ్రీనివాస్‌రెడ్డి ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. సిఐడి నమోదు చేసిన కేసును కొట్టేయాలని, ఎసిబి కోర్టు విధించిన రిమాండ్‌ను రద్దు చేయాలని కోరుతూ టిడిపి అధినేత, మాజీ సిఎం నారా చంద్రబాబు నాయుడు దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌ను హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె శ్రీనివాస్‌రెడ్డి విచారణ జరిపారు. విచారణ ప్రారంభంలోనే తాను గతంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా చేశానని, అప్పుడు చంద్రబాబుకు వ్యతిరేకంగా దాఖలైన కేసుల్లో వాదనలు వినిపించానని, ఇప్పుడు ఈ కేసు విచారణపై ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే (నాట్ బిఫోర్ మీ) చెప్పాలని న్యాయమూర్తి కోరారు. పిటిషన్‌పై విచారణ చేపట్టేందుకు తమకు అభ్యంతరం లేదని పిటిషనరు తరపున న్యాయవాది, ప్రభుత్వ న్యాయవాది చెప్పడంతో విచారణ చేపట్టారు. తొలుత సిఐడి తరపున అదనపు అడ్వకేట్ జనరల్ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి కల్పించుకుని కౌంటర్ పిటిషన్ దాఖలు చేసేందుకు వారం రోజులపాటు గడువు కావాలని కోరడంతో అందుకు న్యాయమూర్తి అనుమతించారు. వెంటనే చంద్రబాబు తరపు

సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా కల్పించుకుని, చంద్రబాబును ఎసిబి కోర్టు ఈ నెల 10న రిమాండ్ ఉత్తర్వులు జారీ చేసిందని, ఈ నేపథ్యంలో చంద్రబాబును విచారించేందుకు ఐదు రోజులపాటు కస్టడీకి ఇవ్వాలని కోరుతూ ఎసిబి కోర్టులో సిఐడి పిటిషన్ దాఖలు చేసిందని గుర్తు చేశారు. కింది కోర్టులో విచారణ కొనసాగితే పిటిషనర్‌కు అన్యాయం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎసిబి కోర్టులోని కస్టడీ పిటిషన్‌పై విచారణను నిలిపేస్తూ ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. ఇందుకు అనుమతిస్తూ న్యాయమూర్తి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసి తదుపరి విచారణను ఈ నెల 19కి వాయిదా వేశారు.

రాజకీయ కక్షతో కేసులో ఇరికించారు : లూథ్రా

అంతకుముందు చంద్రబాబు తరపు న్యాయవాది సిద్ధార్థ లూథ్రా వాదిస్తూ రాజకీయ కక్షతో తప్పుడు కేసు పెట్టినట్టు చెప్పారు. ' పబ్లిక్ సర్వెంట్‌పై కేసు నమోదు/విచారణ చేయాలంటే అవినీతి నిరోధక చట్టం (సవరణ)లోని సెక్షన్ 17ఏ ప్రకారం గవర్నర్ (కాంపిటెంట్ అథారిటీ) అనుమతిని విధిగా తీసుకోవాలన్న నిబంధనను సిఐడి ఉల్లంఘించింది. 17ఏ సెక్షన్ 2018 జులై 26న అమల్లోకి వచ్చింది. ఆ తర్వాత 2021లో సుప్రీంకోర్టు కాంపిటెంట్ అథారిటీ నుంచి అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని తీర్పు చెప్పింది. ఈ కేసులో చంద్రబాబు విషయంలో సిఐడి.. గవర్నర్ అనుమతి తీసుకోలేదు. ఒక్కసారిగా చంద్రబాబును నిందితుడిగా చేర్చి అరెస్టు చేయడం చట్ట వ్యతిరేకం. ఎసిబి కోర్టు రిమాండ్‌కు పంపడం కూడా చెల్లదు. కేసు నమోదు, సిఐడి దర్యాప్తు, ఎసిబి కోర్టు ఉత్తర్వులను రద్దు చేయాలి. రిమాండ్ ఉత్తర్వులు చట్ట వ్యతిరేకం. వాస్తవానికి ఈ కేసు ఎంపి, ఎమ్మెల్యేలపై కేసులను విచారించే ప్రత్యేక కోర్టు పరిధిలోకి వస్తుంది. 2021 డిసెంబరు 9న నమోదు చేసిన ఈ కేసులో 22 నెలలు గడిచాక తీరుబడిగా కావాలనే చంద్రబాబును అందులో చేర్చుతున్నారు. తదుపరి చర్యలను నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలి' అని అంతకుముందు లూథ్రా వాదించారు. దీనిపై స్పందించిన న్యాయమూర్తి, సిఐడి వాదనలు వినకుండా ఉత్తర్వులు జారీ చేయలేమని చెప్పారు. చ

మరో కేసులో నోటీసులు

అమరావతి మాస్టర్ ప్లాన్, ఇన్నర్ రింగ్ రోడ్ అలైన్‌మెంట్ డిజైన్ల మార్పు పేరుతో జరిగిన భూదందాపై సిఐడి 2022లో నమోదు చేసిన కేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ చంద్రబాబు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ ఈ నెల 19కి వాయిదా పడింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ కె శ్రీనివాస్‌రెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. విచారణ ముగిసే వరకు సిఐడి నమోదు చేసిన కేసులో తనకు మధ్యంతర బెయిల్ మంజూరు చేయాలని ఆయన తరపున న్యాయవాది కోరారు. ఇన్నర్ రింగ్ రోడ్ అలైన్‌మెంట్ భూ దోపిడీ జరిగిందనే కేసులో సిఐడి విజయవాడ ఎసిబి కోర్టులో పీటీ వారెంట్ కోరుతూ పిటిషన్ వేసిందన్నారు. ఈ నేపథ్యంలో చంద్రబాబుకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరారు. కౌంటర్ దాఖలు చేస్తామని ప్రభుత్వ న్యాయవాది చెప్పారు. దీంతో ఆ విచారణ కూడా 19వ తేదికి వాయిదా పడింది.

బాబును కలిసిన లూథ్రా

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న టిడిపి అధినేత చంద్రబాబును సుప్రీంకోర్టు న్యాయవాది సిద్ధార్థ లూథ్రా బుధవారం కలిశారు. సెంట్రల్ జైలు వద్దకు మధ్యాహ్నం 3.40 గంటలకు ఆయన చేరుకున్నారు. 40 నిమిషాల పాటు జరిగిన ములాఖత్ అనంతరం బయటకు వచ్చారు. కోర్టులో బుధవారం జరిగిన పరిణామాలు, తదుపరి కార్యాచరణపై బాబుతో చర్చించినట్టు సమాచారం.

జైలు వద్ద అదనపు భద్రత

రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు వద్ద పోలీసులను భద్రతను మరింత పెంచారు. సెంట్రల్ జైలు ప్రాంతంలో బారికేడ్లు పెట్టి బందోబస్తు నిర్వహిస్తున్నారు. ట్రాఫిక్‌పై ఆంక్షలు విధించారు. లూథ్రా వస్తున్న సమయంలో సెంట్రల్ జైలు ప్రాంతంలో రాకపోకలను కాసేపు నిలిపేశారు. జైలు లోపలా, బయటా సెక్యూరిటీ పెంచారు. అదనంగా సిసి కెమెరాలు ఏర్పాటు చేశారు. జైలులో చంద్రబాబు ఉంటున్న స్నేహ బ్యారక్ వద్ద కూడా సిసి కెమెరాలు ఏర్పాటు చేసి నిరంతరం ఆయన భద్రతను పర్యవేక్షిస్తున్నారు. కోస్తాంధ్ర జైళ్ల శాఖ డిఐజి రవికిరణ్ సెంట్రల్ జైలులో భద్రతా ఏర్పాట్లను, చంద్రబాబు ఉంటున్న స్నేహ బ్యారక్‌ను పరిశీలించారు. కోర్టు ఆదేశాల మేరకు చంద్రబాబుకు అందుతున్న వసతులపై ఆరా తీశారు.

ఐదు ఛానల్స్ చూసేందుకు అవకాశం

సెంట్రల్ జైలు స్నేహ బ్యాకర్‌లో చంద్రబాబు గదిలో ఒక హాస్పిటల్ బెడ్, ఫ్యాన్, టివి ఏర్పాటు చేశారు. చంద్రబాబుకు ఐదు ఛానళ్లను చూసే అవకాశం కల్పించారు. న్యూస్ పేపర్లను అందుబాటులో ఉంచారు. స్నానానికి ప్రతిరోజూ రెండు బకెట్ల వేడి నీళ్లు అందిస్తున్నట్లు జైలు అధికారులు తెలిపారు. నిబంధనల మేరకు ఇంటి నుంచి భోజనం, అల్పాహారం అందిస్తున్నారు. భోజనాన్ని పూర్తి స్థాయిలో పరీక్షించిన తరువాతే అందజేస్తున్నారు.

టిడిపి ముఖ్యనేతలతో భువనేశ్వరి భేటీ

చంద్రబాబు భార్య భువనేశ్వరి తొలిసారి టిడిపి ముఖ్యనేతలతో బుధవారం రాజమహేంద్రవరంలోని విడిది గృహంలో భేటీ అయ్యారు. భవిష్యత్ కార్యాచరణపై చర్చించినట్టు సమాచారం.

లోకేష్‌కు రజనీకాంత్ ఫోన్

చంద్రబాబు రిమాండ్ నేపథ్యంలో సినీనటుడు రజనీకాంత్ టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్‌కు ఫోన్ చేశారు. ప్రస్తుత పరిణామాలపై ఆరా తీసినట్టు సమాచారం. తన ఆత్మీయ మిత్రుడు చంద్రబాబు గొప్ప పోరాట యోధుడని, ఆయన ఎన్నడూ తప్పు చేయరని లోకేష్‌కు ధైర్యం చెప్పినట్టు తెలిసింది.

నేడు పవన్ ములాఖత్?

సెంట్రల్ జైలులో ఉన్న చంద్రబాబుతో జనసేన అధినేత పవన్ కల్యాణ్ గురువారం ములాఖత్ కానున్నట్లు సమాచారం. ఇందుకోసం ఆయన దరఖాస్తు చేసుకున్నట్లు తెలిసింది. సాయంత్రం నాలుగు గంటలకు చంద్రబాబును కలిసే అవకాశం ఉంది. అయితే, దీనిపై జైలు అధికారులు ఎలాంటి ప్రకటనా చేయలేదు.

చంద్రబాబు కుటుంబ సభ్యులను కలిసి ములాఖత్‌కు వెళ్తున్న న్యాయవాది సిద్ధార్థ లూథ్రా

విశాఖలో టిడిపి కార్యకర్తలను అరెస్టు చేస్తున్న పోలీసులు

నిరాహార దీక్షలను అడ్డుకున్న పోలీసులు

- పలువురి అరెస్టు

ప్రజాశక్తి - యంత్రాంగం

చంద్రబాబు అరెస్టును ఖండిస్తూ రాష్ట్రవ్యాప్తంగా టిడిపి నాయకులు నిరాహార దీక్షలను చేపట్టారు. పలు జిల్లాల్లో నిరాహార దీక్షలను పోలీసులు అడ్డుకుని, నాయకులను అరెస్టు చేశారు. 'బాబు గారికి తోడుగా.. ఒక నియంతపై పోరాటానికి మేము సైతం సిద్ధం' పేరిట విశాఖలోని జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నిరాహార దీక్షలు చేసేందుకు టిడిపి నేతలు ఏర్పాట్లు చేస్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. పార్టీ జిల్లా అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు సహా పలువురు కార్యకర్తలను అరెస్టు చేశారు. పార్టీ విశాఖ జిల్లా కార్యాలయాన్ని పోలీసులు చుట్టుముట్టగా తెలుగుదేశం నాయకులు తీవ్ర అభ్యంతరం తెలిపారు. తమ కార్యాలయం ముందు స్టాపర్లు పెట్టి రాకపోకలను అడ్డుకోవడంపై మండిపడ్డారు. ఒకానొక దశలో తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో పోలీసులు వెనక్కి తగ్గారు. అనంతరం పార్టీ కార్యాలయంలో చంద్రబాబుకు మద్దతుగా సంతకాల సేకరణ చేపట్టారు. ఎంవిపి కాలనీలోని తన ఇంటి వద్ద మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు దీక్షకు దిగారు. అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లో దీక్షలు చేపట్టారు.విజయనగరం ఆర్‌టిసి కాంప్లెక్సు వద్ద నిరాహారదీక్ష చేస్తున్న నాయకులను పోలీసులు ఈడ్చుకు వెళ్లారు. పార్వతీపురంలో 12 మందిని, గజపతినగరంలో టిడిపి నాయకుడు కరణం శివరామకృష్ణను అరెస్టు చేసిఅనంతరం విడుదల చేశారు. తిరుపతిలో టిడిపి లీగల్ సెల్ ఆధ్వర్యంలో న్యాయవాదులు విధులు బహిష్కరించి నిరసన తెలిపారు.

నిరాహార దీక్షకు దిగితే హత్యాయత్నం కేసులా?

- ప్రభుత్వ తీరుపై లోకేష్ ఆగ్రహం

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

నిరాహార దీక్షకు దిగిన వారిపై హత్యాయత్నం కేసు పెట్టి రిమాండ్‌కు పంపిన చరిత్ర దేశంలో ఎక్కడా లేదని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ తలపెట్టిన నిరసన కార్యక్రమాలను ధర్నా చౌక్‌లో కూడా అనుమతించకపోవడం జగన్ ప్రభుత్వ నియంత పోకడలకు అద్దం పడుతోందని విమర్శించారు. ఇవన్నీ ప్రభుత్వ బలహీనత, జగన్‌లో భయాన్ని స్పష్టం చేస్తున్నాయని అన్నారు. స్కిల్ డవలప్‌మెంట్ కుంభకోణం కోసులో చంద్రబాబును సిఐడి పోలీసులు అరెస్టు చేసి సెంట్రల్ జైలుకు తరలించినప్పటి నుంచి రాజమహేంద్రవరంలోనే లోకేష్ బస చేశారు. బుధవారం ఆయన వివిధ జిల్లాల టిడిపి నేతలతో భేటీ అయ్యారు. చంద్రబాబుపై పెట్టిన అక్రమ కేసుల అంశంతోపాటూ, అరెస్టుపై పార్టీ చేపట్టిన నిరసనలపై వారితో చర్చించారు. చంద్రబాబు అరెస్టుతో జగన్ తాత్కాలిక ఆనందం పొంది ఉండవచ్చని, కానీ ప్రజలు దీన్ని ఆమోదించే పరిస్థితి లేదని అన్నారు. చంద్రబాబు అరెస్టుపై అన్ని వర్గాల్లో ఆసంతృప్తి, ఆవేదన రోజురోజుకూ పెరుగుతోందని పేర్కొన్నారు. చంద్రబాబు అరెస్టుపై మద్దతు తెలిపిన నేతలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.ఈ సమావేశంలో మాజీ మంత్రులు బుచ్చయ్య చౌదరి, అయ్యన్నపాత్రుడు, కళా వెంకట్రావు, చినరాజప్ప, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఎంపి కనకమేడల రవీంద్ర, పలువురు ఎంఎల్‌ఎలు, ఎంఎల్‌సిలు, మాజీ ఎంపిలు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో ఐటి ఉద్యోగులు ర్యాలీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

టిడిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అరెస్టుకు నిరసనగా హైదరాబాద్‌లో ఐటి ఉద్యోగులు బుధవారం ఆందోళనకు దిగారు. అయామ్ విత్ సిబిఎన్ కార్యక్రమానికి పోలీసులు అనుమతి నిరాకరించినప్పటికీ వందలాది ఐటి ఉద్యోగులు విప్రో సర్కిల్ నుంచి ఔటర్ రింగ్‌రోడ్డు వరకు ర్యాలీ నిర్వహించారు. చంద్రబాబు అరెస్టును వారు తీవ్రంగా ఖండించారు. విప్రో సర్కిల్ వద్ద ఐటి ఉద్యోగులు భారీ సంఖ్యలో గుమికూడటంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. ఆందోళనకు దిగిన వారిని చెదరగొట్టేందుకు పోలీసులు ప్రయత్నించినప్పటికీ వారు వెనక్కి తగ్గలేదు. దీంతో విప్రో కూడలిలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఈ సందర్భంగా ఐటి ఉద్యోగులు మాట్లాడుతూ రాజకీయ కోణంలో కక్ష సాధించేందుకే చంద్రబాబును జైలుకు పంపారని ఆరోపించారు. ఆయనపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. టిడిపి హయాంలో తీసుకున్న విధానాల వల్లే తమలాంటి లక్షలాది మంది యువతకు ఉపాధి అవకాశాలు లభించాయని, విదేశాల్లోనూ చాలామంది స్థిరపడ్డారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో తమ తడాఖా చూపిస్తామని ఐటి ఉద్యోగులు పేర్కొన్నారు. కెపి హెచ్‌బి రోడ్డు నెం -1లోనూ ఐటి ఉద్యోగులు నిరసన ర్యాలీ నిర్వహించి నినాదాలు చేశారు.

స్కిల్ స్కామ్‌లో చంద్రబాబు అతీతుడా?

- సజ్జల రామకృష్ణారెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

చంద్రబాబు చట్టానికి, రాజ్యాంగానికి అతీతుడైనట్లు టిడిపి నాయకులు మాట్లాడుతున్నారని వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి విమర్శించారు. స్కిల్ స్కామ్‌లో అడ్డంగా దొరికిపోయి అరెస్టు అయి జైలుకు వెళ్లి కూడా దబాయిస్తున్నారని అన్నారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. టిడిపి హయాంలో డబ్బులు ఎవరి నుంచి చేతులు మారాయో స్పష్టంగా ఆధారాలు కూడా వున్నాయని పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. చంద్రబాబు దోచుకోవడానికే ఓ స్కీమ్ పెట్టారని ఆరోపించారు. షెల్ కంపెనీల ద్వారా ప్రజల సొమ్మును క్యాష్‌గా మార్చుకున్నారని విమర్శించారు. పందల కోట్లు కొల్లగొట్టి ప్రభుత్వ ఖజానాకు నష్టం కలిగించినట్లు పక్కా ఆధారాలతో సిఐడి రిమాండ్ రిపోర్టు ఇచ్చిందన్నారు. 2014 సెప్టెంబరులో స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి దానికి గంటా సుబ్బారావును ఎమ్‌డిగా నియమించారని అన్నారు. 2015లో దాని పేరును స్కిల్ డెవలప్‌మెంట్ డిపార్ట్‌మెంట్‌గా మార్చారన్నారు. ఇడి, ఐటి వంటి నేషనల్ ఏజెన్సీలు కూడా ఈ దోపిడీపై నివేదికను ఇచ్చాయన్నారు. 2019 ఏప్రిల్‌లో సీమెన్స్ ఇన్వెస్టిగేషన్ రిపోర్టులో తాము ఎలాంటి అగ్రిమెంట్ చేసుకోలేదని తమకు సంబంధం లేదని చెప్పిందన్నారు. అసలు తమకు డబ్బు రాలేదని సీమెన్స్ సంస్థ అంటోందన్నారు. డబ్బు టెక్

సమన్వయంతో పనిచేస్తే మంచి ఫలితాలు

- మంత్రి ముత్యాల నాయుడు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వైద్యారోగ్య, పంచాయతీరాజ్‌శాఖ సమన్వయంతో పనిచేస్తే మంచి ఫలితాలు వస్తాయని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి బూడి ముత్యాలనాయుడు అన్నారు. పేదల ఆరోగ్యానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పూర్తి భరోసా ఇస్తున్నారన్నారు. ఢిల్లీ నుంచి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము బుధవారం ఆయుష్మాన్ భవ కార్యక్రమాన్ని ప్రారంభించగా, రాష్ట్ర ప్రభుత్వం తరపున మంగళగిరి ఎపిఐఐసి టవర్స్‌లోని వైద్యారోగ్యశాఖ ప్రధాన కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపర్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ ద్వారా రూ.వేలకోట్లు ప్రభుత్వం వెచ్చిస్తోందన్నారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ, వైద్యారోగ్యశాఖ సమన్వయంతో ఆయుష్మాన్ భవ కార్యక్రమాన్ని రాష్ట్రంలో విజయవంతం చేశామన్నారు. హెల్త్ వెల్నెస్ సెంటర్స్ స్టేట్ నోడల్ ఆఫీసరు కె శ్యామల, టిబి జాయింట్ డైరెక్టరు రమేష్, ఎన్‌హెచ్‌ఎం సిఎఒ గణపతిరావు, నిక్షయ్ మిత్రలు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డిజిఎం కృష్ణకుమార్, బి ప్రభు, ఎజిఎం పిఆర్‌పి సుబ్రమణ్యం, కనెక్ట్ టు ఆంధ్ర సీనియర్ కన్సల్టెంట్ కెబి ప్రశాంతిరెడ్డి, ప్రోగ్రామ్ ఆఫీసరు బండ్లమూడి ఎ ప్రసాద్, డాక్టర్ సమరం పాల్గొన్నారు. వీరందరినీ మంత్రి సన్మానించారు.

ఐఫోన్ 14, 13 ధరల తగ్గింపు

న్యూయార్క్ : ఐఫోన్ 15 సిరీస్ విడుదల చేసిన ఆపిల్ కంపెనీ.. ఇంతక్రితం ఐఫోన్ 14, ఐఫోన్ 13 ధరలను తగ్గిస్తున్నట్లు ప్రకటన చేసింది. ప్రతీ సారి కొత్త సిరీస్ ఫోన్లను విడుదల చేసిన వెంటనే పాత మోడళ్ల ధరలను తగ్గిస్తోన్న విషయం తెలిసిందే. ఐఫోన్ 14 మోడల్ 128జిబి బేస్ వేరియంట్ ధరను రూ.69,900గా నిర్ణయించింది. ఇంతక్రితం దీని ధర రూ.79,900గా ఉంది. ఈ మోడల్‌లో 256జిబి, 512జిబి వేరియంట్ల ధరలు వరుసగా రూ.79,900, రూ.99,900కు తగ్గించింది. వీటి పాత ధరలు రూ.89,000, రూ.109,900గా ఉన్నాయి. ఐఫోన్ 13పైన కూడా ఇంతక్రితం ధరతో పోల్చితే రూ.10వేలు తగ్గించింది.

ఐక్య పోరాటాలతో అభివృద్ధి సాధ్యం

- వెనుకబడిన జిల్లాగా ప్రకాశాన్ని గుర్తించాలి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె ప్రభాకరరెడ్డి

ప్రజాశక్తి- మార్కాపురం, పెద్దారవీడు (ప్రకాశం జిల్లా)

వెనుకబడిన మూడు ప్రాంతాలనూ కలిపి ప్రకాశం జిల్లాగా 1972లో ఏర్పాటు చేశారేగానీ, దాని అభివృద్ధి గురించి పాలకులు పట్టించుకోలేదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.ప్రభాకరరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా అభివృద్ధి కోసం ఐక్య పోరాటాలు అవసరమన్నారు. ప్రకాశం జిల్లా సమగ్రాభివృద్ధి కోసం సిపిఎం పోరుబాట-పాదయాత్రలో భాగంగా మార్కాపురంలోని అమ్మవారిశాల బజారులో బుధవారం రాత్రి జరిగిన బహిరంగ సభలో ఆయన ముఖ్యవక్తగా పాల్గొని ప్రసంగించారు. రాష్ట్ర బడ్జెట్ రూ.2.79 లక్షల కోట్లని, అందులో రూ.10 వేల కోట్లు వెనుకబడిన ప్రకాశం జిల్లాకు ప్రభుత్వం ఎందుకు కేటాయించలేకపోతోందని ప్రశ్నించారు.

బహిరంగ సభలో మాట్లాడుతున్న ప్రభాకరరెడ్డి

ఓట్లు, సీట్లు కోసం పాలకులు పనిచేస్తున్నారే తప్ప, ప్రజల సమస్యలు పట్టించుకోవడం లేదని విమర్శించారు. వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణంలో జాప్యం చేస్తూ ఈ ప్రాంత ప్రజలకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని అన్నారు. ఈ ప్రాజెక్టును పూర్తి చేసి నిర్వాసితులను ప్యాకేజీ ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సభకు సిపిఎం పట్టణ కార్యదర్శి డి.సోమయ్య అధ్యక్షత వహించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జివి కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాదయాత్ర బృందానికి సమస్యలు విన్నవించిన వెలిగొండ నిర్వాసితులు

సిపిఎం పోరుబాట-పాదయాత్ర పెద్దారవీడు మండలంలోని వెలిగొండ ముంపు గ్రామమైన నుంకేసులకు మంగళవారం రాత్రి చేరుకుంది. ఆ గ్రామంలోని పరిస్థితులను, అక్కడి నిర్వాసితుల ఆర్థిక ఇబ్బందులను సిపిఎం నాయకులు అడిగి తెలుసుకున్నారు. వెలిగొండ ప్రాజెక్టు పనులు ప్రారంభమై రెండున్నర దశాబ్దాలు గడిచినా నేటికీ తమకు అందించాల్సిన ప్యాకేజీ ఇవ్వలేదని, ప్యాకేజీ వస్తుందన్న నమ్మకం కూడా కలగడం లేదని పాదయాత్ర బృందం ఎదుట పలువురు నిర్వాసితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జివి.కొండారెడ్డి మాట్లాడుతూ వెలిగొండ ప్రాజెక్టు ముంపు గ్రామాల్లోని నిర్వాసితులంతా కన్నతల్లి లాంటి ఉన్న ఊరిని వదిలి పెద్ద త్యాగమే చేశారన్నారు. వారిని పెద్ద మనసుతో ప్రభుత్వం ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

సదస్సులో మాట్లాడుతున్న మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు

పోలవరం నిర్వాసితులకు న్యాయం చేయాలి

- వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ నిర్ణయాన్ని వెనక్కుతీసుకోవాలి
- ఎఐకెఎంకెఎస్ జాతీయ గిరిజన సదస్సులో తీర్మానం

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

పోలవరం నిర్వాసితులకు సమగ్ర, శాస్త్రీయ పునరావాసం కల్పించాలని, వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, అటవీ సంరక్షణ చట్ట సవరణను రద్దు చేయాలని జాతీయ గిరిజన సదస్సులో వక్తలు తీర్మానించారు. ఆల్ ఇండియా కేత్ మజ్దూర్ కిసాన్ సభ (ఎఐకెఎంకెఎస్) ఆధ్వర్యంలో విశాఖలోని సుబ్బలక్ష్మి కల్యాణ మండపంలో జరుగుతున్న జాతీయ గిరిజన సదస్సు బుధవారానికి రెండో రోజుకు చేరింది. ముఖ్య అతిథిగా హాజరైన వ్యవసాయ శాఖ మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి కార్పొరేట్ల ప్రయోజనాలే ముఖ్యమని అన్నారు. పేదలు, గిరిజనుల కష్టాలు మోడీ సర్కారుకు పట్టడం లేదన్నారు. కార్పొరేట్ల ప్రయోజనాల కోసం బిజెపి ప్రభుత్వం తీసుకొచ్చిన మూడు వ్యవసాయ నల్ల చట్టాలను ఐక్య పోరాటాలతో ఎలా తిప్పికొట్టిందో వివరించారు. ప్రస్తుత అటవీ పరిరక్షణ (సవరణ) చట్టం ప్రజానీకానికి, పర్యావరణానికి ప్రమాదకరమైందని తెలిపారు. హైకోర్టు న్యాయవాది పల్లా త్రినాథరావు మాట్లాడుతూ అడవిపై ఆదివాసుల జీవనం, సంస్కృతి ఆధారపడి ఉన్నాయని, ప్రస్తుత చట్ట సవరణతో వారికి ముప్పు ముంచుకొస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. పాలకులు అడవులను ఆదాయ వనరులుగా చేస్తూ అనేక మినహాయింపులతో కార్పొరేట్లకు కట్టబెడుతున్నారని విమర్శించారు. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ మాట్లాడుతూ పాలకులు సముద్రం, భూమి, అడవిపై ఆధిపత్యం కోసం చట్టాలు చేస్తున్నారని అన్నారు. అటవీ ప్రాంతాల్లో సమగ్ర అభివృద్ధి కోసం పాలకులపై ఉద్యమించాలని కోరారు. సదస్సులో ఆలిండియా ట్రైబల్ ఇంటలెక్చువల్ ఫోరం ప్రధాన కార్యదర్శి ఘూసీరాం, ఎఐకెఎంకెఎస్ కో - కన్వీనర్ ఎన్ రూన్సీ, జాతీయ సభ్యులు శ్రీకాంత్ మహంతి (ఒడిశా), వివిధ రాష్ట్రాల ప్రతినిధులు పాల్గొన్నారు.

98-డిఎస్‌సి అభ్యర్థులందరికీ ఉద్యోగాలివ్వాలి

- పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

1998 డిఎస్‌సిలో అన్యాయం జరిగిన అభ్యర్థులందరికీ ఉద్యోగాలు కల్పించాలని పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు డిమాండ్ చేశారు. విజయవాడలోని ధర్నా చౌక్ వద్ద 1998 డిఎస్‌సి మిగిలిన అభ్యర్థులకు ఉద్యోగాలు ఇవ్వాలని కోరుతూ పోరాట కమిటీ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలను లక్ష్మణరావు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 25 ఏళ్ల నిరీక్షణ అనంతరం అందరికీ ఉద్యోగాలు వస్తాయని అభ్యర్థులు ఆశపడ్డారన్నారు. 2022 జులైలో ఉద్యోగం చేయడానికి ఇష్టం ఉన్న అభ్యర్థులు తమ విల్లింగ్ తెలియజేయాలని ప్రభుత్వం కోరిన మేరకు 6,754 మంది ధ్రువీకరణ పత్రాలు పరిశీలన చేయించుకున్నారని తెలిపారు. వీరందరికీ ఉద్యోగాలు కల్పిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చి 4,072 మందికి మాత్రమే ఉద్యోగాలు ఇచ్చిందన్నారు. ఇందులో రూల్ ఆఫ్ రిజర్వేషన్లు పాటించకపోవడంతో ఎస్‌సి, బిసి, వికలాంగులు, మహిళా అభ్యర్థులు 2,326 మందికి అన్యాయం జరిగిందన్నారు. కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంద్ర మాల్యాద్రి మాట్లాడుతూ.. కర్నూలు, కడప, ప్రకాశం, గుంటూరు, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, నెల్లూరు, కృష్ణా జిల్లాల అభ్యర్థులకు అన్యాయం చేశారన్నారు. డివైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి రామన్న మాట్లాడుతూ.. మిగిలిపోయిన అభ్యర్థులు ఉద్యోగాలు రాకపోవడంతో దుర్భర జీవితం గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పోరాట కమిటీ అధ్యక్షులు జి మోహనరావు మాట్లాడుతూ.. అందరికీ ఉద్యోగాలు ఇవ్వాలని, శాంతియుతంగా ఆందోళన చేస్తున్నట్లు పేర్కొన్నారు. నిరాహార దీక్షలో నాయకులు పి రమేష్, మేరీ, సుహాసిని, సరస్వతి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గడువులోగా పోలవరం జల విద్యుత్ కేంద్రం పనులు పూర్తి చేయాలి : ఎపి జెన్ కో

ప్రజాశక్తి - పోలవరం (ఏలూరు జిల్లా)

నిర్దిష్ట గడువులోగా పోలవరం జల విద్యుత్ కేంద్రం పనులను పూర్తిచేయాలని సంబంధిత అధికారులకు ఎపి జెన్‌కో మేనేజింగ్ డైరెక్టర్ కెవిఎన్.చక్రధర్‌బాబు సూచించారు. పోలవరం జల విద్యుత్ కేంద్రాన్ని బుధవారం ఆయన సందర్శించారు. పోలవరం స్పిల్ వే, ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లను పరిశీలించారు. ఆ తరువాత ఫెర్రెల్స్ తయారు చేసే ప్రాంతం, జల విద్యుత్ కేంద్రం టన్నెల్స్ నుంచి ప్రయాణించి దిగువ ప్రాంతానికి చేరుకుని కోన్, డ్రాఫ్ట్ ట్యూబుల ఏర్పాట్లను, టైల్ రైజ్ ఛానల్‌ను పరిశీలన చేశారు. అనంతరం పోలవరం జల విద్యుత్ కేంద్రంలో జెన్‌కో కోసం నిర్మిస్తున్న కార్యాలయం వద్దకు వెళ్లి మొక్కలు నాటారు. ఆ తర్వాత జెన్ కో, ఎంఇఐఎల్ సంస్థ ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇప్పటి వరకూ ఎలాంటి అవాంతరాలూ లేకుండా నిర్దేశిత లక్ష్యం మేరకు పనులు జరుగుతున్నాయని, ఇక నుంచి కూడా అలానే ఒక ప్రణాళిక ప్రకారం పనులు పూర్తి చేసి త్వరితగతిన ప్రాజెక్టును పూర్తి చేయాలన్నారు. విద్యుత్ ప్రాజెక్ట్ పూర్తయ్యి ఉత్పాదన ప్రారంభమైతే రాష్ట్రంలో విద్యుత్ కొరత తీరుతుందని, పరిశ్రమలు, వ్యవసాయ రంగానికి అవసరమైన మేర విద్యుత్ సరఫరా చేయొచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో జెన్ కో హైడెల్ డైరెక్టర్ ఎంవివి సత్యనారాయణ, హైడల్ ప్రాజెక్ట్స్ సిఇ ఎం.సూరజ్ కుమార్, సివిల్ విభాగం సిఇ వై.కోటేశ్వరరావు, సిఇ డిజైన్స్ ఎం.రవీంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

HDB FINANCIAL SERVICES హెచ్‌డిబి ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్
నమోదిత కార్యాలయం : రాఖీ, 2వ అంతస్తు, లాండ్ గార్డెన్ రోడ్డు, నవరంగ్‌పుర, అహ్మదాబాద్-09
శాఖా కార్యాలయం : 76-8-10/1, ఫ్లాట్.నం.4, భవానీ టవర్స్, స్వాతి థియేటర్ రోడ్డు, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా భవానీపురం ప్రక్కన, విజయవాడ-520012.

సవరణ

దరఖాస్తుదారులు మరియు సహ దరఖాస్తుదారులు : "మిత్ర మార్కెటింగ్ మరియు ఇతరులు" కు సంబంధించిన ఇ-వేలం అమ్మకం నోటీసు 13.09.2023న ఈ వార్తాపత్రికలో ప్రచురించబడినది. ఉ ద్దేశించిన బిడ్డర్లు "28.09.2023న సా.6 గం.లకు లేదా అంతకు ముందు" కి బదులుగా "20.09.2023" తేదీ బిడ్లను సమర్పించాలి. సీల్డ్ టెండర్లు "29.09.2023న ఉ.10.30 గం."కి బదులుగా "21.09.2023న ఉ.10.30 గం." కు ఉద్దేశించిన బిడ్డర్ల ముందు తెరవబడతాయి. అమ్మకం యొక్క మిగిలిన అన్నీ ఇతర షరతులు మరియు నిబంధనలు మారలేదు.

ప్రదేశం : విజయవాడ తేది : 13.09.2023 సం/- అధీకృత అధికారి

ANDHRA PRADESH CAPITAL REGION DEVELOPMENT AUTHORITY
Lenin Center, Governerpet, Vijayawada – 520002 (A.P.)
NIT No. 06 /MAU61-OPOM0OUTS (STSP)/1/2022-OM-Part (1) Dated: 13.09.2023
E-PROCUREMENT SHORT TENDER NOTICE
Name of Work: "Annual Contract for Engaging Security services at APCRDA Office, Lenin Center, Guntur, Tenali & Thullur and also at different locations in Vijayawada". For supply of **Thirteen (13) Security Guards and One (1) Head Guard. ECV Rs.24,38,683/-.** Above bid can be downloaded on e-procurement portal from **15.09.2023** and Due date for submission of Bid is on **22.09.2023 @ 15.00 Hrs.** Date of opening of Technical bid is on **22.09.2023 @ 16.00 Hrs.** Please refer to **www.apeprocurement.gov.in** and **www.crda.ap.gov.in** for details.
Sd/- COMMISSIONER, APCRDA, Vijayawada

అవసరమైన వారిచే అసాధారణ సర్వసభ్య సమావేశం ప్రకటన
కంపెనీ పేరు: నేచర్ ఫీడ్స్ లిమిటెడ్
CIN: U15400AP2013PLC091514
రిజిస్టర్డ్ ఆఫీసు: ఇంటి నంబరు: 1-4/3-7ఎ, మున్సిపల్‌వార్డు నం.1, రామ విద్యాలయం స్ట్రీట్, కోమకోటినగర్, విజయవాడ, శ్రీకాకుళం, ఆం.ప్ర.-520012, ఇండియా.

ఇందుమూలంగా అవసరమైనవారు అనగా., తెల్లాకుల భాను కుమార్, కె. కృష్ణ కిషోర్, దేవతి రామ సుబ్బారావు, కొల్లిపార వేంకటేశ్వర్లు మరియు నూకారపు బిక్షమయ్యలు కంపెనీ, నేచర్ ఫీడ్స్ లిమిటెడ్ యొక్క వాటాదారులుగా ప్రకటన ఇవ్వడమేమనగా, **నేచర్ ఫీడ్స్ లిమిటెడ్** యొక్క సభ్యుల అసాధారణ సర్వసభ్య సమావేశం (ఏజియం) నిర్వహించుట కొరకు చెల్లించిన మూలధనంలో 11.12% ప్రాతిపదిస్తు, కంపెనీ యొక్క వాటా మూలధనంలో సరాసరిగా 4,45,000 ఈక్విటీ వాటాలు కలిగియుండి, హోటల్ శ్రీ కుబేరా గ్రాండ్, 6వ అంతస్తు, విశ్వాస్-2 కాన్ఫరెన్స్ హాల్, 26-4-9, జ్ఞానొలివ్ స్ట్రీట్, జిమ్ఖానా గ్రౌండ్ దగ్గర, గాంధీనగర్, విజయవాడ, ఆం.ప్ర.-520003, ఇండియా వద్ద సోమవారం, 09 అక్టోబర్, 2023న ఉ॥ 10:30గం.లకు నిర్వహించబడుతుంది.

మేము, పై పేర్కొనబడిన అవసరమైన వారు, అసాధారణ సర్వసభ్య సమావేశంకు ఆహ్వానించి ప్రకటనలో పేర్కొన్నట్లుగా డైరెక్టర్లను తొలగించు మరియు నియమించుట కొరకు, కంపెనీల చట్టం, 2013 యొక్క సెక్షన్ 169, 152, 160 & 115తో చదువబడే సెక్షన్ 100 ప్రకారం అసాధారణ సర్వసభ్య సమావేశంకు ఆహ్వానించుట కొరకు కావలసిన లేఖ& ప్రత్యేక ప్రకటనను 04.08.2023న కంపెనీ యొక్క బోర్డు ఆఫ్ డైరెక్టర్ల పై బట్వాదాచేయబడినది. దాని కాపీ ఏదైతే, 13 సెప్టెంబర్, 2023న కంపెనీ వాటాదారులందరికీ పంపబడినది.

అయితే, కంపెనీల చట్టం, 2013 యొక్క నియమాలు దాని క్రింది రూల్స్‌తో చదువబడి అవసరమైనట్లుగా మాచే కోరిన ప్రకారం సభ్యుల అసాధారణ సర్వసభ్య సమావేశంకు ఆహ్వానించుట కొరకు తగిన అవసరమైన చర్యలు తీసుకొనుటలో బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లు విఫలంచెందారు.

కంపెనీల చట్టం, 2013 యొక్క సంబంధిత రూల్స్‌తో చదువబడే, పై పేర్కొన్న నియమాల ప్రకారం, అట్టి అవసరం స్వీకరణ తేది నుండి నలభై-ఐదు రోజులకు ఆలస్యం కాకుండా ఒక రోజున కోరినదానిలో ఇవ్వబడిన విషయం పరిగణించుట కొరకు సమావేశం పిలుపుకు వాలిడ్ రిక్విజిషన్ స్వీకరణ తేది నుండి ఇరువై-ఒక రోజుల్లోగా ఒక వేశ బోర్డుచేయనట్లైతే, రిక్విషేషన్ తేది నుండి మూడు నెలల కాలవ్యవధిలోగా తమంతట తాముగా అవసరమైనవారిచేత సమావేశంకు పిలువబడి మరియు నిర్వహించబడుతుంది.

అందుకుగాను, కంపెనీల చట్టం, 2013 యొక్క వర్తించు నియమాలతో అనుసరించి మరియు దాని హక్కులను వినియోగించి, దాని క్రింద రూపొందించిన రూల్స్‌తో చదువబడి, ఇజియం నోటీసులో ఇవ్వబడినట్లుగా వ్యాపారంను చేపట్టుట కొరకు కంపెనీ యొక్క సభ్యుల అసాధారణ సర్వసభ్య సమావేశం నోటీసును ఇందుమూలంగా జారీచేయబడినది మరియు కంపెనీ యొక్క సభ్యులందరికీ పంపబడుచున్నది.

కంపెనీ యొక్క సభ్యులు పాల్గొనుట మా కంపెనీ చర్యలు అకౌంటబిలిటీ& ట్రాన్స్‌పెరెన్సీ పొందుట తప్పనిసరి. ఈ ఇజియం బట్వాదా మాకు సంబంధిత అనుభవం మరియు తెలియజేసిన నిర్ణయాలు చేయుటకు వాటాదారులకు అవకాశం అప్పనిసరి. మా కంపెనీ యొక్క తదుపరి నిర్ణయం విచారణ మరియు ప్రభావంచేయుటలో ఉమ్మడిగా మాకు వాటాదారులందరికి మేము ప్రోత్సహిస్తున్నాము. దానికితోడు, మేము అనుకూల మార్పు డ్రైవ్‌చేస్తాము మరియు మా వాటాదారుల మంచి ఆసక్తి పొందుదుము. ఒకవేళ సమావేశానికి హాజరవదలచిన & నోటీసు స్వీకరించని ఏవరైనా వాటాదారులు నోటీసు& ప్రాక్సీ ఫారంను మెయిల్ ఐడి:Tellakula.bhanu@gmail.comపై అభ్యర్థన మెయిల్‌చేయుట ద్వారా పొందవచ్చును.

మీ విధేయులు
ఇతర కావలసినవారితోపాటు మరియు తరపున
సం/- తెల్లాకుల భాను కుమార్
నేచర్ ఫీడ్స్ లిమిటెడ్ యొక్క వాటాదారు
Email: Tellakula.Jbhanu@gmail.com Mobile: 9848571533
ప్రదేశం: విజయవాడ,
తేది: 13.09.2023
MEENAKSHI

అప్పు చెల్లించిన తర్వాత..
నెల రోజుల్లో ఆస్తి పత్రాలు ఇవ్వాల్సిందే

- లేదంటే రోజుకు రూ.5వేల జరిమానా
- రుణదాతలకు ఆర్‌బిఐ మార్గదర్శకాలు

న్యూఢిల్లీ : రుణగ్రహీతలు అప్పు పూర్తిగా చెల్లించిన తర్వాత కూడా సంబంధిత ఆస్తి పత్రాలు ఇవ్వడానికి అనేక బ్యాంకులు, ఎన్‌బిఎఫ్‌సిలు ఇబ్బందులకు గురి చేస్తున్న నేపథ్యంలో ఆర్‌బిఐ కీలక నిర్ణయం తీసుకుంది. రుణం చెల్లించిన 30 రోజుల్లోగా సంబంధిత ఆస్తి పత్రాలు ఖాతాదారులకు అందించాలని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) మరోమారు ఆదేశాలు జారీ చేసింది. బాధ్యతాయుత రుణాల జారీని ప్రోత్సహించే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు బుధవారం వెల్లడించింది. రుణ చెల్లింపులు పూర్తయిన 30 రోజుల్లోగా స్థిర, చరాస్తుల సంబంధించిన పత్రాలను రుణగ్రహీతలకు తిరిగి ఇవ్వాలని ఆదేశించింది. దీనిపై 2003 నుంచే స్పష్టమైన నిబంధనలు, మార్గదర్శకాలు ఉన్నప్పటికీ.. అనేక విత్త సంస్థలు అవి పాటించకుండా ఖాతాదారులను ఇబ్బందులకు గురి చేస్తున్న ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. వీటిపై ఆర్‌బిఐకి అనేక ఫిర్యాదులు అందుతున్నాయి. ఇలాంటి వాటితో పలు వివాదాలు తలెత్తుతున్నాయని ఆర్‌బిఐ తెలిపింది. ఈ నేపథ్యంలో రుణదాతల్లో బాధ్యతాయుత రుణ జారీలను ప్రోత్సహించడం కోసమే కొత్తగా ఉత్తర్వులు ఇచ్చినట్లు వెల్లడించింది. కొత్త మార్గదర్శకాలు 2023 డిసెంబర్ 1 నుంచి అమల్లోకి వస్తాయని స్పష్టం చేసింది. ఒకవేళ రుణం పూర్తిగా తిరిగి చెల్లించిన తర్వాత 30 రోజుల్లోగా పత్రాలను ఇవ్వలేకపోతే.. అందుకుగల కారణాలను తెలియజేస్తూ బ్యాంకులు ఖాతాదారులకు సమాచారం అందించాలి. సరైన కారణాలు లేకుండా విత్త సంస్థలు జాప్యం చేస్తే.. రుణ గ్రహీతలకు రోజుకు రూ.5,000 చొప్పున పరిహారం చెల్లించాల్సి ఉంటుంది. ఒకవేళ పత్రాలు కనపడకుండా పోతే.. వాటిని తిరిగి పొందేలా రుణగ్రహీతలకు సాయం చేయాలి. అలాగే అందుకు అయ్యే ఖర్చును మొత్తం బ్యాంకులే భరించాల్సి ఉంటుంది. దీనితో పాటు ఆలస్యానికి గాను రోజుకు రూ.5,000 పరిహారం చెల్లించాల్సి ఉంటుందని ఆర్‌బిఐ నూతన మార్గదర్శకాల్లో స్పష్టం చేసింది. రుణ గ్రహీతలు తమ స్థిర లేదా చరాస్తులకు సంబంధించిన పత్రాలను రుణం పూర్తిగా చెల్లించిన వెంటనే సంబంధిత విత్త సంస్థలు లేదా వాటికి సంబంధించిన కార్యాలయాల నుంచి తీసుకోవాలని ఆర్‌బిఐ సూచించింది. ఒకవేళ రుణగ్రహీతల అకాల మరణం సంభవిస్తే పాటించాల్సిన నియమ నిబంధనలను కూడా బ్యాంకులు, బ్యాంకింగేతర విత్త సంస్థలు పక్కాగా రూపొందించాలని పేర్కొంది. ఆ విషయాలను సంస్థ వెబ్‌సైట్‌లో తప్పనిసరిగా పొందుపర్చాలని ఆర్‌బిఐ ఆదేశించింది.

ల్యాప్‌టాప్‌ల విభాగంలోకి టెక్నో

హైదరాబాద్ : అత్యాధునిక సాంకేతిక ఆవిష్కరణలు కలిగిన టెక్నో సంస్థ కొత్తగా ల్యాప్‌టాప్‌ల విభాగంలోకి ప్రవేశించినట్లు ప్రకటించింది. మెగా బుక్ ల్యాప్‌టాప్ టి1ను విడుదల చేసినట్లు వెల్లడించింది. ఇది అసమానమైన పనితీరు, నిరంతరాయ వినియోగం, సున్నితమైన డిజైన్‌తో వినియోగదారులను ఆకర్షించనుందని తెలిపింది. 17.5 గంటల ఇంటెల్ 11 జనరేషన్ ప్రాసెసర్‌తో ఈ ల్యాప్‌టాప్‌ను తీసుకొచ్చినట్లు పేర్కొంది. దీని ప్రారంభ ధరను రూ.37,999గా నిర్ణయించింది. సెప్టెంబర్ 13 నుంచి అమెజాన్‌లో విక్రయానికి అందుబాటులో ఉంచినట్లు పేర్కొంది.

జన్యు పరిరక్షణ ప్రయోగం విజయవంతం

- పిండ గర్భధారణ ప్రక్రియ ద్వారా ఒంగోలు జాతి కోడెదూడ జననం

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు (ప్రకాశం జిల్లా)

ఒంగోలు జాతి జన్యు పరిరక్షణ లక్ష్యంగా ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలంలోని చదలవాడ పశుఉత్పత్తి క్షేత్రం పశువైద్యులు చేపట్టిన ప్రయోగం విజయవంతమైనట్లు క్షేత్రం డీడీ బి.రవి తెలిపారు. ట్రాన్స్‌పజైనల్ ఆల్ట్రాసౌండ్ గైడెడ్ ఒవెమ్ పికప్, ఇన్విట్రో ఫెర్టిలైజేషన్ ఎంబ్రియో ట్రాన్స్‌ఫర్ టెక్నాలజీతో గత ఏడాది నవంబరులో బొల్లాపల్లి శ్రీలక్ష్మినరసింహస్వామి దేవస్థానం గోశాలలోని (అద్దె గర్భం సరోగసి) మేలురకం ఒంగోలు జాతి పిండాన్ని తీసుకుని గర్భధారణ ప్రక్రియను చదలవాడ పశుఉత్పత్తి క్షేత్రంలోని పశువైద్యులు విజయవంతంగా చేపట్టారు. తద్వారా ఆవు గర్భం దాల్చి మంగళవారం రాత్రి మేలుజాతి ఒంగోలు కోడెదూడకు జన్మనించింది. కోడెదూడను పశుసంవర్ధక శాఖ ఉపసంచాలకులు డాక్టరు రమేష్, సహాయ సంచాలకులు డాక్టరు పద్మావతి, డిడి రవి, పశువైద్యులు సోమశేఖర్, విజయకుమార్‌రెడ్డి, మాధవీలత బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా చదలవాడ పశుఉత్పత్తి క్షేత్రం కార్యనిర్వహణాధికారి శ్రీనివాసరావు, గుంటూరు లాం పశు పరిశోధన సంస్థ శాస్త్రవేత్త ముత్తమరావు మాట్లాడుతూ.. మేలుజాతి పశువులను తక్కువ సమయంలో వృద్ధి చేయడానికి ఐవిఎఫ్ఇటి ప్రయోగం అనుకూలమైన పద్ధతి అని తెలిపారు. ఈ విధానాన్ని

ఆంధ్రప్రదేశ్ పశుగణాభివృద్ధి సంస్థ, శ్రీవెంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం సంయుక్త కార్యాచరణ ద్వారా రాష్ట్రీయ గోకుల్ మిషన్‌లో భాగంగా ఎల్ఐవిఎఫ్ పిండగర్భ ధారణ పథకం చేపట్టి దేశీయ జాతుల పిండాలు ఉత్పత్తి చేసి వాటి పరిరక్షణకు దోహదపడుతుందన్నారు.

పరిశోధన సాగిందిలా..

మేలుజాతి ఒంగోలు ఆవునుండి పశు గణాభివృద్ధి సంస్థ పశువైద్యులు డాక్టర్ శ్రీమన్నారాయణ అండాలను సేకరించారు. లాంపార్మ్ శాస్త్రవేత్త శ్రీకాంత్ వాటిని ఇన్విట్రో పెర్టిలైజేషన్ ద్వారా మేలుజాతి ఆంబోతు వీర్యంతో ఫలదీకరణ చేసి ఏడు రోజులు ప్రయోగశాలలో శాస్త్రీయ విధానంలో పిండాలుగా మార్చి ద్రవన(త్రజనిలో భద్రపరిచారు. సరోగేట్ (అద్దె గర్భం) ఆవును కోలలపూడి డాక్టర్ మాధవీలత ఎంపిక చేశారు. ఆవు గర్భంలో పిండాన్ని డాక్టర్ సోమశేఖర్ ప్రవేశపెట్టారు. మామూలు పద్ధతి ద్వారా అయితే ఆవు జీవితకాలంలో కేవలం ఎనిమిది నుంచి పది దూడలు మాత్రమే జన్మనిస్తాయి. జన్యుపర పద్ధతి ద్వారా అయితే ఒక్క ఆవులో 150 పిండాల వరకు జన్యుమార్పిడి చేసి సుమారు 50 నుండి 60 దూడలు పొందవచ్చు.

కార్లలో ఆరు ఎయిర్‌బ్యాగ్‌లు తప్పనిసరి కాదు :

- మంత్రి నితిన్ గడ్కరీ వెల్లడి

న్యూఢిల్లీ : కార్లలో ఆరు ఎయిర్ బ్యాగులను అమర్చాలనే నిబంధనను తప్పనిసరి చేయడం లేదని కేంద్ర రోడ్లు

సంపాదకీయం

సిగ్గుచేటు

దేశంలో మానవ హక్కులు రోజురోజుకి తీసికట్టుగా మారుతున్న తీరుకు ఐక్యరాజ్యసమితి తాజాగా వ్యక్తం చేసిన ఆందోళన అద్దం పడుతోంది. జి-20 సమావేశాలను ఘనంగా నిర్వహించామంటూ కేంద్ర ప్రభుత్వ పెద్దలు అట్టహాసంగా ప్రచారం చేసుకుంటున్న వేళ ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల మండలిలో ఈ పరిణామం చోటుచేసుకుంది. మండలి 52వ సమావేశం ప్రారంభమైన తొలి రోజే ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల చీఫ్ వోల్కర్ తుర్క్ మన దేశంలో నెలకొన్న పరిస్థితులను, ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణిని సుదీర్ఘంగా వివరించడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. ఐక్యరాజ్యసమితి మాత్రమే కాదు! జి-20 సమావేశాలలో పాల్గొని ఢిల్లీ నుండి వియత్నాం పర్యటనకు వెళ్లిన అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ అక్కడ దిగీదిగగానే భారతదేశంలో పతనమౌతున్న మానవ హక్కుల పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. వియత్నాం పర్యటనలో బైడెన్ మాట్లాడుతూ జి-20 శిఖరాగ్ర సదస్సు సందర్భంగా జరిగిన చర్చల్లో భారత ప్రధాని నరేంద్ర మోడీతో మానవ హక్కులను గౌరవించే అంశాన్ని లేవనెత్తినట్లు తెలిపారు. బైడెన్ తనంతట తానుగా ఈ విషయాలను వివరించడం ప్రాధాన్యత సంతరించుకుంది. బైడెన్ ఈ వ్యాఖ్యలు చేసిన కాసేపటికే మీడియాతో మాట్లాడిన వైట్‌హౌస్ అధికార ప్రతినిధి ఒకరు ఆరోగ్యవంతమైన ప్రజాస్వామ్య పరిరక్షణ ఆవశ్యకత గురించి మోడీతో బైడెన్ మాట్లాడినట్లు వివరించారు.

అమెరికా అధ్యక్షునితో పాటు వివిధ దేశాధినేతలతో జరిపిన చర్చలు ఫలప్రదమైనాయని మోడీ, ఆయన పరివారం ఘనంగా సాగించిన ప్రచారంలోని డొల్లతనం బైడెన్ వ్యాఖ్యలతో బట్టబయలైంది. నిజానికి ఈ ఏడాది ప్రారంభంలో విడుదల చేసిన '2022వ సంవత్సరంలో వివిధ దేశాల్లో మానవ హక్కులు'పై విడుదల చేసిన నివేదికలో సైతం భారత్‌లో చోటుచేసుకుంటున్న పరిణామాలపై అమెరికా ఆందోళన వ్యక్తం చేసింది. మణిపూర్‌లో చోటుచేసుకున్న మారణకాండపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ యూరోపియన్ పార్లమెంటు జులై 13వ తేదిన ఒక తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించింది. మణిపూర్‌లో మానవ హక్కులను కాపాడటానికి కేంద్ర ప్రభుత్వం తక్షణం చర్యలు తీసుకోవాలని ఆ తీర్మానంలో కోరింది. ఆ తరువాత కూడా మణిపూర్‌లో విద్వేష మంటలు రగలుతూనే ఉన్నాయి. హ్యూమన్‌రైట్స్ వాచ్ 2022వ సంవత్సరానికి విడుదల చేసిన ప్రపంచ దేశాల నివేదికలో సైతం మన దేశంలో చోటు చేసుకుంటున్న పరిణామాల పట్ల తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది.

ఆమ్నెస్టీ ఇంటర్‌నేషనల్ సహా దాదాపు అన్ని నివేదికలు మన దేశంలో మతోన్మాద దాడులు పెరగుతున్నాయని, అధికార యంత్రాంగం ఈ తరహా దాడుల పట్ల చూసీచూడనట్లు వ్యవహరిస్తోందని పేర్కొన్నాయి. ఈ నివేదికలు విడుదలైన తరువాత మణిపూర్, హర్యానా ఘటనలు చోటుచేసుకోవడం మరింత ఆందోళన కలిగించే అంశం! ఒకవైపు విశ్వగురువులమని చెప్పుకుంటూ మరోవైపు ఇతర దేశాల నుంచి సుద్దులు చెప్పించుకోవాల్సి రావడం ఎంత సిగ్గుచేటు! మిగిలిన విషయాలు ఎలా ఉన్నప్పటికీ లౌకికవాదం, మత సామరస్యం విషయంలో మన దేశానికి ప్రపంచ దేశాల్లో కొన్ని సంవత్సరాల క్రితం వరకు మంచి గుర్తింపే ఉంది. మోడీ నేతృత్వంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత దేశ ప్రతిష్టను మంటగలుపుతున్నారు. 'బిజెపి ప్రభుత్వాలు, సంఘపరివార్ మూకలు మైనార్టీలను లక్ష్యం చేసుకుని విద్వేష ప్రచారం చేస్తూ ఒక పథకం ప్రకారం దాడులు చేస్తున్నాయి. ఈ భావజాలాన్ని జాతీయ మానవ హక్కుల కమిషన్‌తో పాటు, న్యాయ వ్యవస్థలోకి చొప్పించడానికి ప్రయత్నిస్తుండటం ఆందోళనకరం' అని హ్యూమన్‌రైట్స్ వాచ్ పేర్కొంది. ఇంత స్పష్టంగా కాకపోయినా 'మతోన్మాదం, విద్వేష ప్రసంగాలు, అసహనం, వివక్ష వంటి పరిస్థితులను భారత ప్రభుత్వం మరింత సూటిగా, కఠినంగా ఎదుర్కోవాలి. మైనార్టీల హక్కుల పరిరక్షణ కోసం రెట్టింపు కృషిని చేయాలి' అని తాజాగా ఐక్యరాజ్యసమితి సూచించింది. రాజకీయ లబ్ధి కోసం విభజన వ్యూహాలను నడిపే మోడీ సర్కారు దీనిని పట్టించుకుంటుందా అన్నది అనుమానమే! మేధావులు, ప్రజాతంత్ర శక్తులు, లౌకిక వాదులు మరింత అప్రమత్తంగా, ఐక్యంగా ఉండాల్సిన సమయమిది!

మహోన్నతుల మాట

నీ కష్టాన్ని చూసి
ఇంకెవరో నవ్వితే నవ్వనీ
ఏం పర్వాలేదు.
కానీ నువ్వు మాత్రం
ఇంకొకరి కష్టాన్ని చూసి
ఎప్పుడూ నవ్వకు.
- చార్లీ చాప్లిన్



మన నైతిక విలువలెక్కడ ?

ప్రస్తుతం మనం నైతిక విలువలు కనపడకుండా పోతున్న సమాజంలో ఉన్నాం. ఈ సమాజంలో మానవత్వంతో వ్యవహరించడం ఆడ, మగ అందరికీ అసాధ్యం అయిపోతోంది. ప్రభుత్వం సంగతి చూస్తే అది నిష్పక్షపాత వైఖరితో, న్యాయబద్ధంగా, ధర్మంగా వ్యవహరించడం అనేది ఎప్పుడో మరిచిపోయింది. ఇక నాయకులు ప్రజలకు చేసిన వాగ్దానాలను నిలుపుకోవడంలో విఫలమౌతున్నారు. నిజానికి వాళ్ళు తమ వాగ్దానాలను అమలు చేస్తారని ఎవరూ ఆశించడం లేదుకూడా. ఏ మాత్రం జంకు, గొంకు లేకుండా, మనస్సాక్షి అనేదే లేకుండా 'మాదే మెజారిటీ గనుక మా మాటే శాసనం' అనే విధానాన్ని ప్రభుత్వం ఆచరిస్తోంది. ప్రాచీన నిర్మాణాలను అమూల్యమైన చారిత్రక సంపదగా పరిగణించి పరిరక్షించాల్సినది పోయి వాటిని ఉంచాలా, కూల్చాలా అన్నది వాటిని నిర్మించిన వారి మతాన్ని బట్టి నిర్ణయిస్తున్నారు. ఆఫీసులలో పని చేసేవారి పట్ల, ఇళ్ళల్లో నివసించేవారి పట్ల ఎలాంటి వైఖరి ఉండాలన్నది కూడా అదే మాదిరిగా నిర్ధారిస్తున్నారు. ప్రభుత్వాన్ని గాని, ప్రభుత్వపు దన్నుతో రెచ్చిపోతూ విద్వేషాన్ని రెచ్చగొట్టే ప్రదర్శనల్ని నిర్వహిస్తున్న అసాంఘిక శక్తుల్ని గాని నువ్వు ప్రశ్నిస్తే ఇక అంతే. నువ్వే వాళ్ళకి ప్రధాన లక్ష్యం అయిపోతావు. మారు మాట్లాడకుండా తల ఒగ్గడమే నేడు అనుసరించాల్సిన పద్ధతి. మానవత్వం, న్యాయం, స్వేచ్ఛ వంటివి ఇప్పుడు డీప్ ఫ్రీజ్‌లో ఉన్నాయి. భవిష్యత్తులో వాటిని బైటకు తెచ్చి నడిపించేదెన్నడో తెలీదు.

జియా ఉస్ సలామ్

మారిపోతున్న విలువలు

యోగితా భయానా ఒక సామాజిక సేవకురాలు. గురుగ్రాంలో కొందరు గూండాలు ఒక ముస్లిం వ్యక్తికి చెందిన దుకాణాన్ని తగులబెడితే, దానిని తిరిగి నిర్మించుకోడానికి సహాయం చేసిందామె. ఆ సమాచారాన్ని, ఆమెకు కృతజ్ఞతలు తెలియజేస్తున్న ఆ దుకాణదారుడి వీడియో క్లిప్పింగ్‌ని సోషల్ మీడియాలో పెట్టారు. వెంటనే యోగితకు మొదలయ్యాయి ట్రోలింగ్ వేధింపులు. నష్టపోయినవాళ్ళు మరో 50, 60 మంది ఉన్నారు, వాళ్ళందరికీ కూడా పోయి సాయం చెయ్యమంటూ వెటకారంగా కొందరు కామెంట్స్ పెట్టారు. ఆమె ఇంటి చుట్టుపక్కల హిందూ మహిళలు ఇంకా ఉన్నారు కదా, వాళ్ళకి లేని బాధ నీకెందుకు? అంటూ మరి కొంతమంది కామెంట్ చేశారు. బహుశా ఒక పది, పదిహేనేళ్ళ క్రితం ఇటువంటి సహాయాన్నే చేసి వుంటే, ఆ కాలంలో యోగితకు అభినందనల



ఇప్పుడు త్రిశూలాలు, పలుగులు, గొడ్డళ్ళు పుచ్చుకుని దాడి చేసే మూకలు అవసరం లేదు. ఇప్పుడు బుల్‌డోజర్లు ఆ పని కానిచ్చేస్తున్నాయి. ఒక చిన్న దుకాణం నడుపుకుంటూ బతుకుతున్నవాడిపైన లేదా ఒక చిన్న ఇంట్లో కాపురం ఉంటున్నవాడిపైన దాడి చేసి వాటిని కూల్చివేసినప్పుడు గతంలో అక్కడినుంచి మూకలు చెల్లాచెదురు అయిపోయేవి. కాని ఇప్పుడు ఆ విధ్వంసం ముందు దర్జాగా నిలబడి సెల్ఫీ తీసుకుంటున్నారు.

పరంపర ఎదురై వుండేది. మత సామరస్యాన్ని నిలబెట్టినందుకు గౌరవం దక్కేది. కాని, ఇప్పుడా పరిస్థితి లేదు. మారిపోయింది.

పాతకాలపు విలువలు ఇప్పుడు లేవు. మత విశ్వాసాలు వేరు వేరుగా ఉన్నా, అందరమూ కలిసి బతుకుదాం అన్న ఐక్యతా స్ఫూర్తిలో విశ్వాసం లేనివాళ్ళు ఇప్పుడు కోట్లలో తయారయ్యారు. ఇప్పుడు ఎవరికి వారే. పక్కవాడు ఎలా పోయినా పట్టించుకోనవసరం లేదు అన్న ధోరణి బాగా పెరిగింది. హర్యానా లోని నువాలో అనిస్ అనే వ్యక్తి ముగ్గురు హిందూ యువకులకు తన ఇంట రక్షణ కల్పించి వాళ్ళని వెంట తరుముతున్న మూకల నుండి కాపాడాడు. తమ ప్రాణాలు నిలబెట్టినందుకు ఆ ముగ్గురూ అతని పట్ల కృతజ్ఞత తెలిపారు. కాని, ఆ మర్నాడు అనిస్ ఇంటిని బుల్‌డోజర్ తో నేలమట్టం చేసేశారు. హర్యానాలో బుల్‌డోజర్లతో విధ్వంసం చేయడం ఇప్పుడు పరిపాటి అయిపోయింది. ఆ విషయం మీద పంజాబ్-హర్యానా హైకోర్టు జోక్యం కల్పించుకుని ఈ విధంగా చెప్పింది: "ముందస్తుగా నోటీసులు ఏవీ జారీ చెయ్యకుండా, కూల్చివేతకు అనుమతించే ఉత్తర్వులు ఏవీ లేకుండా శాంతి, భద్రతల రక్షణ పేరుతో ఇలా భవనాలను కూల్చివేయడం తప్పు. శాంతి భద్రతల సమస్య ఒక సాకుగా ఉపయోగించుకుని ఒకే మతానికి చెందిన వారి ఇళ్ళను కూల్చివేయడం జరుగుతోందా అన్న అంశాన్ని కూడా చూడాలి. కొన్ని జాతుల సమూహాలను నిర్మూలించే విధానాన్ని ప్రభుత్వం అనుసరిస్తోందా అన్నది కూడా పరిశీలించాలి."

సమాజంలో నైతిక విలువల పతనం ఇదివరకే మొదలైంది. కాని మరీ ఇంత అధమ స్థితికి చేరుకోవడం గతంలో లేదు. అతి నీచంగా, పబ్లిక్‌గా ఆడబిడ్డల్ని మణిపూర్ వీధుల్లో అవమానపరచిన వైనం ఆ అధమ స్థితికి సూచన కాక ఇంకేమిటి? ఆ ఉదంతంపై అధికారంలో ఉన్న వారి స్పందన సంగతేమిటి? అది దేన్ని సూచిస్తోంది? ఆ బాధితులను ఆ పాశవిక మూకలకు అప్పజెప్పినది ఆడవాళ్ళేనంటూ ఆ దుర్మార్గాన్ని సమర్థించే నైచ్యం దేనికి సంకేతం? కథువాలో జరిగిన మరో ఉదంతం చూడండి! అక్కడ ఒక ఎనిమిదేళ్ళ ముక్కుపచ్చలారని పసిబాలికను ఘోరంగా రేప్ చేశారు. ఆ ఉదంతంలో నిందితులకు మద్దతుగా కొందరు జనాలు ఊరేగింపు తీశారు !

వెయ్యేళ్ళ క్రితమో, లేకుంటే నాలుగు వందల ఏళ్ళ క్రితమో ఎవరో ఒక రాజు, లేదా దండెత్తి వచ్చినవాడు తలవంపులు తెచ్చే విధంగా వ్యవహరించాడంటూ ఇప్పుడు దానికి బాధ్యులుగా కొందరిని చేసి వారిపై దాడులకు దిగుతున్నారు. ఆ దాడులను మనలో కొందరు సమర్థిస్తున్నారు. కాని ఇప్పుడే, మనముందే మణిపూర్‌లో, హర్యానా లో జరుగుతున్న అన్యాయాలకు బలైపోయిన బాధితులకు న్యాయం చేయాలని అడగడానికి మనం నోళ్ళు మెదపడం లేదు. ఫెవికాల్‌తో మన పెదవులు అతుక్కుపోయాయి. ఎప్పుడో, ఎవరో దండెత్తి వచ్చినవాళ్ళు మన ప్రార్థనాస్థలాలను ఏ విధంగా అపవిత్రం చేశారో (ఆ ఘటనల్లో కొన్ని జరిగినవి, మరికొన్ని కేవలం కల్పితమైనవి కూడా ఉన్నాయి) చర్చించి, అప్పటి చారిత్రిక తప్పిదాలను ఇప్పుడు సరి చేయడానికి తయారయ్యాం. అది కూడా ఏ విధంగా? కొన్ని వందల సంవత్సరాల క్రితం చచ్చిపోయిన ఆ రాజు ఏ మతానికి చెందినవాడో ఆ మతానికి చెందిన ప్రార్థనా స్థలాలమీద ఇప్పుడు దాడులు చేయడం ద్వారా. అప్పుడు ఆ రాజు చేసినది తప్పు అయితే ఇప్పుడు మరి మనం చేస్తున్నదేమిటి? అదే తప్పు కాదా? ఉత్తరప్రదేశ్‌లో, ఢిల్లీలో, హర్యానాలో పదే పదే మసీదులమీద దాడులు జరుగుతూనే వున్నాయి. "మసీదు అంటే ఏమిటి? మహా అయితే అదో కట్టడం. చాలా కట్టడాలను కూల్చివేసినట్టే వాటినీ కూల్చేస్తాం" అని బాబరి మస్జిద్ విధ్వంసం సందర్భంలో ఎల్.కె.అద్వానీ వ్యాఖ్యానించాడు. ఇప్పుడు ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ జ్ఞానవాపి మసీదు వియంలో కూడా అదే వ్యాఖ్యానం చేశాడు. జరిగినదానికి ఏ విధమైన విచారం గాని సిగ్గు గాని లేనే లేదు. ఇది చరిత్రను రీవైండ్ చేస్తున్నట్టు ఉంది.

నైతిక దౌర్బల్యం తాండవిస్తున్న కాలం ఇది. ప్రతీ జాతీ అప్పుడప్పుడు మనో వైకల్యానికి లోనవుతూ వుంటుంది. మన విషయంలో ఆ వైకల్యం షార్ట్ టర్మ్ అమ్నీషియా (స్వల్పకాలిక మతిమరుపు) రూపంలో వ్యక్తం ఔతున్నట్టుంది. జరుగుతున్న వాటిని మనం చూస్తూనే వున్నాం. కాని వెంటనే మరిచి పోతున్నాం. గోగూండాలు ఒక మనిషిని చితక్కొట్టి చంపేసినా, ఒక మహిళ సామూహిక అమానుషత్వానికి బలైపోయినా ఆ సంఘటనలు మన మనస్సుల్లోని జల్లెడ కన్నాలనుండి జారిపోతున్నాయి. చాలా కొద్ది విషయాలను మాత్రమే గుర్తుంచుకోగలుగుతున్నాం. రోజూ కళ్ళెదుట జరుగుతున్న నీచమైన సంఘటనలను చూసి చూసి అలసిపోయామా? బహుశా అంతే అయివుండాలి మరి. కాకపోతే మన రోజువారీ పనుల్లో మునిగిపోయి వాటిని పట్టించుకోలేకపోతున్నామా? అది కూడా అయివుండొచ్చు. కారణం ఏదైనా, మన నుండి ప్రతిస్పందన లేకపోవడం వలన విద్వేష మూకలకి, అసహనపరులకి ధైర్యం పెరుగుతుంది. జరుగుతున్న దాడి అక్కడో మసీదు మీదనో, ఇక్కడో దుకాణం మీదనో అయితే, అంతవరకూ అయితే వాటిని అదుపు చేయవచ్చు. కాని ఇప్పుడు జరుగుతున్న దాడి అటువంటి చెదురు మదురు దాడి కాదు. ఇక్కడే అసలు సమస్య ఉంది.

జోక్యం కల్పించుకోకపోవడం

ఇప్పుడు త్రిశూలాలు, పలుగులు, గొడ్డళ్ళు పుచ్చుకుని దాడి చేసే మూకలు అవసరం లేదు. ఇప్పుడు బుల్‌డోజర్లు ఆ పని కానిచ్చేస్తున్నాయి. ఒక చిన్న దుకాణం నడుపుకుంటూ బతుకుతున్నవాడిపైన లేదా ఒక చిన్న ఇంట్లో కాపురం ఉంటున్నవాడిపైన దాడి చేసి వాటిని కూల్చివేసినప్పుడు గతంలో అక్కడినుంచి మూకలు చెల్లాచెదురు అయిపోయేవి. కాని ఇప్పుడు ఆ విధ్వంసం ముందు దర్జాగా నిలబడి సెల్ఫీ తీసుకుంటున్నారు. వాటిని వీడియోలు చేసి సోషల్ మీడియాలో పెడుతున్నారు. ఒక గోగూండా ఒక బక్కచిక్కిన పేద మీద విరుచుకుపడి, అతడిని వేధిస్తున్న వైనాన్ని, ప్రయోగిస్తున్న తిట్లను రికార్డు చేయిస్తున్నాడు. రైలులో ఒక పోలీసు జవాను తన పై అధికారిని, మరో ముగ్గురు ముస్లిం ప్రయాణికులను కాల్చి చంపి, ఆ తూటాలకు బలై కొనఊపిరితో వాళ్ళు అతగాడి బూట్లకింద కొట్టుమిట్టాడుతూ వున్నప్పుడే అక్కడే ఒక సెల్ఫీ వీడియో తీసుకున్నాడు. అందులో ప్రధాని నరేంద్ర మోడీకి, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌కి జేజేలు పలికాడు. జనాలు కూడా జరుగుతున్న దారుణాన్ని ఆపే ప్రయత్నం చేయడం కన్నా దానిని వీడియోగా తీయడమే ప్రధానం అనుకుంటున్నారు. ఇక బుల్‌డోజర్ బాధితులు తమపై జరిగే దుర్మార్గాన్ని తామే కళ్ళారా చూస్తూ నిస్సహాయంగా ఉండిపోతున్నారు. కళ్ళ ముందే తాము కట్టుకున్న ఇల్లు ఒక్కో ఇటుకా, ఒక్కో రాయీ రాలి పడుతూంటే బిక్కచచ్చి కూలబడుతున్నారు. మరోపక్క మీడియాలో కూడా కొందరు ఆ విధ్వంసాన్ని చూపిస్తూ క్షణాల్లో 'న్యాయం' ఏ విధంగా జరిగిందో చెప్తూ కీర్తిస్తున్నారు.

బుల్‌డోజర్ విధ్వంసంలోని క్రూరత్వాన్ని, మూక దాడుల హత్యల్లోని ఆటవికతను, దేశ ప్రజల్లో ఒక పెద్ద భాగం పశు ప్రాయులుగా దిగజారి ప్రవర్తించడాన్ని మనం అందరం చూస్తున్నాం. ఏమీ పట్టనట్టు, లేదా ఇది రోజూ జరుగుతున్నదేలే అన్నట్లు చూస్తున్నాం. సామాజిక స్పృహ లేకుండా బతికేయడం నేటి ప్రజానీకానికి అలవాటైపోయింది మరి!

(స్వేచ్ఛానుసరణ)

★

ఇక బుల్‌డోజర్ బాధితులు తమపై జరిగే దుర్మార్గాన్ని తామే కళ్ళారా చూస్తూ నిస్సహాయంగా ఉండిపోతున్నారు. కళ్ళ ముందే తాము కట్టుకున్న ఇల్లు ఒక్కో ఇటుకా, ఒక్కో రాయీ రాలి పడుతూంటే బిక్కచచ్చి కూలబడుతున్నారు. మరోపక్క మీడియాలో కూడా కొందరు ఆ విధ్వంసాన్ని చూపిస్తూ క్షణాల్లో 'న్యాయం' ఏ విధంగా జరిగిందో చెప్తూ కీర్తిస్తున్నారు.

గాంధీని 'వాడుకోవడం' కాదా ఇది?

కె. శాంతారావు

'చె'ప్పిందే చేయాలి-చేసిందే చెప్పాలి'-గాంధీ సిద్ధాంతంగా ప్రజల ముందుకు వచ్చింది. మనిషి నిజాయితీకి, పారదర్శకతకు ఇది ఓ మంచి కొలమానం. ఆధునిక రాజకీయాల్లో గాంధీకి ఆ విశిష్ట స్థానం లభించింది గనకనే అంతర్జాతీయంగానూ, జాతీయంగానూ అటు నేతలకు, ఇటు సాధారణ ప్రజలకు ఆయన పూజనీయుడైనాడు.

జి-20 కూటమి దేశాల శిఖరాగ్ర సమావేశాల సందర్భంగా దేశాధినేతలందరూ రాజ్‌ఘాట్‌కు వెళ్ళి ఆ విధంగా సమైక్యంగా గాంధీజీకి ఘన నివాళులర్పించారు. గాంధీ ప్రబోధించిన సంరక్షణా సూక్తులే దేశాల మధ్య సత్ సంబంధాలకు కీలకమని అమెరికా అధ్యక్షుడు జోబైడెన్ ఈ సందర్భంగా పేర్కొనడం గమనార్హం.

అసలు అంతకు ముందే ప్రధాని నరేంద్ర మోడీ జి-20 అధినేతలకు ట్విట్టర్ ద్వారా ఆహ్వానం పలుకుతూ మహాత్మా గాంధీ సందేశాన్ని ఉదహరించారు. 'మానవ సమానత్వం, సౌభ్రాతృత్వం లక్ష్యంగా కొత్త ప్రపంచం అడుగు ముందుకు వేయాలి.' ఇందుకు భారత్ తన వంతు సాయాన్ని తాను అందిస్తుందని మోడీ తెలిపారు. మానవాభ్యుదయమే లక్ష్యంగా అభివృద్ధి సాగాలని, దానినే మనమంతా ఇప్పుడు సమ్మిళిత అభివృద్ధిగా పేర్కొంటున్నామని కూడా మోడీ వక్కాణించారు.

అంతేగాకుండా మహాత్మాగాంధీ నిలువెత్తు చిత్తరువు రాట్నంతో కూడిన జి-20 ఇతివృత్తపు కటౌట్‌ను ఇండియా గేట్ వద్ద అందరి దృష్టి ఆకర్షించేలా భారీ ఎత్తున ఏర్పాటు చేశారు.

'ఒకే భూమి - ఒకే కుటుంబం - ఒకే భవిష్యత్' అనేది జి-20 ఇతివృత్తం (థీమ్). వినడానికి అనడానికి ఈ పలుకులు ఎంతో మాధుర్యంగానూ ఆశావహంగానూ కన్పిస్తాయి. ఊహించిన దానికన్నా ఈ సమావేశాలు చాలా ఘనంగా జరిగాయి కూడా. కాని సాధించిందేమిటి? అని ప్రశ్నించుకుంటే... 'మాటలు కోటలు దాటాయి కాని చేతలు గడప దాటలేదు' అన్నట్టయింది.

ఆఫ్రికన్ యూనియన్ (ఎ.యు)ను చేర్చుకుని జి-21 దేశాల కూటమిగా ప్రకటించడం తప్ప తక్కినదంతా ఎక్కువ భాగం యథాస్థితిగానో లేదా పక్కనపెట్టినట్టో కన్పిస్తుంది.



మణిపూర్‌లో మానవ హక్కులు మంటగలుస్తున్న విషయం ప్రపంచం ఎల్లెడలా వ్యక్తం అవుతూనే ఉన్నది. అయినా పిల్లి కళ్ళు మూసుకుని పాలు తాగినట్టుగా బిజెపి డబుల్ ఇంజన్ సర్కార్ వ్యవహరిస్తున్నది. ఈ క్రమంలో మతోన్మాద శక్తులు మత విద్వేష యత్నాలను నిస్సిగ్గుగా బలపరుస్తూనే ఉన్నాయి. మత సామరస్యానికి, మానవ హక్కుల సాధనకు పాటుపడిన మహాత్మా గాంధీని నఖశిఖ పర్యంతం ద్వేషించే వీరు...ఓట్ల కోసం తిరిగి అదే గాంధీ అడుగు జాడల్లోనే తాము నడుస్తున్నట్టు నటించడం... నయవంచన కాక మరేమిటి?

ప్రపంచం నలుమూలలా ఉద్రిక్తతలు చోటు చేసుకుంటున్నాయి. ఆకలి-కరువు విలయతాండవం చేస్తున్నాయి. భారతదేశంతో సహా పలు దేశాల బాల్యం పౌష్టికాహార లోపంతో గరిష్టంగా ఇబ్బంది పడుతున్నది. మానవ హక్కులు మృగ్యం అవుతున్నాయి. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి దేశాల మధ్య ఏకాభిప్రాయం ఎప్పుడూ ఉండదు. అలాగే ఇక్కడ కూడా. ఎవరి ధోరణి వారిదే. ఎవరి ప్రయోజనాలు వారివే. ఉమ్మడి ప్రయోజనాలకు కట్టుబడటం చాలా చాలా అరుదు. భద్రతా మండలి ఆమోదించిన తీర్మానాలను సభ్యదేశాలు అంగీకరించవు, ప్రపంచ బ్యాంకు, అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐ.ఎం.ఎఫ్) సంస్థలు పిర్రను చూసి పీటను వేసిన చందంగా అగ్రదేశాలను ఓ రకంగానూ, పేద దేశాలను మరోరకంగానూ చూస్తుంటాయి. ఆర్థిక క్రమశిక్షణను పాటించని పెద్ద దేశాలకు అదేపనిగా రుణాలివ్వడం, క్రమశిక్షణను పాటించే చిన్న దేశాలకు రుణాలు మంజూరు చేయడంలో జాప్యం పాటించడం వంటి అసమాన పద్ధతలు కొనసాగుతూనే ఉంటాయి. పెట్టుబడిదారీ వ్యవస్థలో బ్యాంకుల పరిస్థితి ఎక్కడైనా ఇది షరా మామూలే.

అయితే, ప్రతి దేశం తన సార్వభౌమత్వాన్ని కాపాడుకునే హక్కును గౌరవిస్తూనే ఇతర దేశాల పట్ల సమాన గౌరవాన్ని కాపాడవలసిన బాధ్యతను ఈ సమావేశాలు డిక్లరేషన్ రూపంలో మరోసారి గుర్తుచేశాయి. అదికూడా లేకపోతే ఈ సమావేశాలకు అర్థమే ఉండదు మరి! 37 పేజీల డిక్లరేషన్ ప్రాదేశిక సార్వభౌమత్వాన్ని పరస్పరం గౌరవించుకోవాలని, ఉగ్రవాద నిర్మూలనకు అన్ని దేశాలు కట్టుబడి ఉండాలని పిలుపునిచ్చింది.

ఆహార భద్రత, ఆయుధ నియంత్రణ, పర్యావరణ పరిరక్షణ, పట్టి పీడించే మహమ్మారి వ్యాధులు, మాదకద్రవ్యాల మాఫియా, డిజిటల్, ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ (కృత్రిమ మేధస్సు) విస్ఫోటనం, జీవవైవిధ్యం మొదలగు ఎన్నో మౌలిక సమస్యలున్నా వాటి జోలికి ఈ సమావేశాలు అంతగా పోలేదు. ఒకవేళ పోయినా అందరికీ సమ్మతమైన విశ్వసనీయమైన కార్యాచరణ ఉండదు.

ఇన్ని పరిమితులున్నా... ఈ సమావేశాలను అత్యంత ఘనంగానూ, గర్వకారణంగాను చూపించి రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓట్ల లబ్ధి పొందాలని బిజెపి, సంఘ్ పరివార్ శక్తులు భావించడం సహజమే. ఆ యత్నంలో భాగంగానే జి-20 పేర అవసరం ఉన్నా లేకున్నా దేశవ్యాప్తంగా వందలాది అనుబంధ సభలు సమావేశాలు జరిపారు. అసలు ఐక్యరాజ్యసమితి సర్వప్రతినిధి సభలే అచేతనంగా మారుతున్న తరుణంలో ఈ జి-20 సమావేశాలు మెరుగైన నిర్ణయాలు తీసుకోవచ్చని ఆశించిన వారికి ఇప్పుడు ఆశాభంగం ఏర్పడింది. రష్యా-ఉక్రెయిన్ యుద్ధ సమస్య, పర్యావరణ సంక్షోభానికి కారణభూతమైన శిలాజ ఇంధనాల గురించి ప్రముఖంగా చర్చించకుండానే సమావేశాలు ముగిశాయి. వచ్చే ఏడు (2024) వరుస క్రమంలో భాగంగా ఈ సమావేశాలు జి-21గా బ్రెజిల్‌లో జరుగుతాయి.

ఈ మాత్రం దానికే అంతగా ఆర్భాటాలకు పోయి, వేలకోట్ల ప్రజాధనం వెచ్చించి విశ్వగురువుగా సంబరపడాలా? అనేది రాజకీయ పరిశీలకుల భావన. చిచ్చుబుడ్డిలా తుస్సుమనటం అంటే ఇదేగా!

ఈ సందర్భంగా మురికివాడల ప్రజానీకాన్ని తొలగించడం, పచ్చని పరదాల వెనుక వారిని దాపెట్టడం ఎక్కడికక్కడ రంగు రంగుల విద్యుత్ దీపకాంతులతో ఫౌంటెన్‌లను అమర్చి రాజధాని ఢిల్లీ నగరాన్ని ఇంతగా 'మేక్ ఓవర్' చేయడం అవసరమా? అనేది వారి ప్రశ్న. గోడీ భజన మీడియా అయితే ఇక సరేసరి. అడుగడుగునా భారతీయ సంస్కృతి ఉట్టిపడేలా మోడీ ఒక్కరే ఒంటి చేత్తో ఈ సమావేశాలు నిర్వహించినట్టు ఆకాశానికి ఎత్తేస్తున్నాయి. అసలు సారం లేకుండా అలంకరణలు ఎంతున్నా ఏమి సుఖం?

కాగా, ముఖ్య విషయం రెండ్రోజులు తర్వాత బయటకు వచ్చింది. ఢిల్లీ నుండి సరాసరి వియత్నాం వెళ్ళిన అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ విలేకరులతో మాట్లాడుతూ కుండ బద్దలు కొట్టారు. 'మానవ మనుగడకు ఎక్కడైనా, ఎవరైనా మానవ హక్కులను గౌరవించాల్సిన అవసరం ఉన్నది. బలమైన సుసంపన్నమైన దేశ నిర్మాణానికి పౌరహక్కులు పత్రికా స్వేచ్ఛ కీలకం' అని మోడీతో తాను జరిపిన భేటీలో మాట్లాడినట్టు బైడెన్ తెలిపారు.

మరి ఈ విషయం పత్రికల్లో, మీడియాలో ఎక్కడా పొక్కలేదు. అందుకే 'మేం పత్రికా సమావేశం పెట్టం. మిమ్మల్ని పెట్టనీయం' అన్న చందంగా మోడీ ప్రభుత్వం తయారైందని కాంగ్రెస్ విమర్శించింది. ఇదీ 'మోడీ మార్క్ ప్రజాస్వామ్యం' అని ఎద్దేవా చేసింది.

మణిపూర్‌లో మానవ హక్కులు మంటగలుస్తున్న విషయం ప్రపంచం ఎల్లెడలా వ్యక్తం అవుతూనే ఉన్నది. అయినా పిల్లి కళ్ళు మూసుకుని పాలు తాగినట్టుగా బిజెపి డబుల్ ఇంజన్ సర్కార్ వ్యవహరిస్తున్నది. ఈ క్రమంలో మతోన్మాద శక్తులు మత విద్వేష యత్నాలను నిస్సిగ్గుగా బలపరుస్తూనే ఉన్నాయి. మత సామరస్యానికి, మానవ హక్కుల సాధనకు పాటుపడిన మహాత్మా గాంధీని నఖశిఖ పర్యంతం ద్వేషించే వీరు...ఓట్ల కోసం తిరిగి అదే గాంధీ అడుగు జాడల్లోనే తాము నడుస్తున్నట్టు నటించడం... నయవంచన కాక మరేమిటి?

బిజెపి, సంఘ్ పరివార్ ప్రజా ప్రతినిధులు సైతం గాంధీ హత్యను సమర్థిస్తూ, హంతక గాడ్సేను పూజిస్తూ ఉత్సవాలు చేసుకొనే వీరి పట్ల ప్రధాని మోడీ మౌనంగా ఉండటం తెలిసిందే. ఆయనా ఆ తానులో ముక్కే కదా. అంతా కపటంతోటే నెట్టుకు రావాలని చూస్తున్నారు. అందుకే 'చేసేది చెప్పరు. చెప్పింది చేయరు'. గాంధీ సిద్ధాంతానికి ఇది పూర్తి విరుద్ధం. అయినా జి-20 దేశాల సమావేశాలకు గాంధీనే మోడీకి బ్రాండ్ అంబాసిడర్ కావడం ప్రజలకు విడ్డూరంగానీ, మత విద్వేష శక్తులకు కాదు కదా!

/వ

నాలుక కోస్తా... కళ్లు పీకేస్తా : షెకావత్

జైపూర్ : సనాతన ధర్మాన్ని వ్యతిరేకించే వారిపై కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ అవాకులు చవాకులు పేలారు. అలాంటి వారి నాలుక కోస్తానని, కళ్లు పీకేస్తానని బెదిరించారు. రాజస్థాన్‌లోని బర్మర్‌లో మంగళవారం నిర్వహించిన ఓ ర్యాలీలో కేంద్ర మంత్రి పెట్రేగిపోయారు. సనాతన ధర్మాన్ని నిర్మూలించాలంటూ తమిళనాడు మంత్రి ఉదయనిధి స్టాలిన్ చేసిన ప్రకటనపై ఆయన ఆగ్రహంతో ఊగిపోయారు. 'సనాతన ధర్మానికి ఎదురవుతున్న సవాళ్లను కలసికట్టుగా ప్రతిఘటించాలని ఆయన పిలుపునిచ్చారు. 'సనాతన ధర్మానికి వ్యతిరేకంగా మాట్లాడే వారి నాలుక కోసేయాలి. ఆ ధర్మానికి వ్యతిరేకంగా ఎవరైనా కళ్లు విప్పితే వాటిని పీకేయాలి' అని షెకావత్ చెప్పుకొచ్చారు.

పోలీసుల 'మీడియా' సమావేశాలపై..
3నెలల్లోపు 'మాన్యువల్' రూపొందించండి

- కేంద్రానికి సుప్రీం ఆదేశం

న్యూఢిల్లీ : క్రిమినల్ కేసుల దర్యాప్తు సమయంలో పోలీసులు ఏర్పాటు చేసే మీడియా సమావేశాల విషయంలో సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. పక్షపాతంతో కూడిన రిపోర్టింగ్ వల్ల నిందితుడు నేరం చేశాడనే అనుమానాలకు దారి తీస్తుందని అభిప్రాయపడింది. అందుకే క్రిమినల్ కేసులకు విషయంలో పోలీసులు మీడియాకు వెల్లడించే సమయంలో అనుసరించాల్సిన నిబంధనలపై సమగ్ర గైడ్‌లైన్స్ (మాన్యువల్) మూడు నెలల్లోగా రూపొందించాలని కేంద్ర హోం మంత్రిత్వశాఖను సుప్రీం కోర్టు ఆదేశించింది. దీని రూపకల్పనపై అన్ని రాష్ట్రాల డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డిజిపి)లు నెల రోజుల్లో సూచనలు చేయాలని, అటు జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సి) అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని కూడా సుప్రీంకోర్టు సూచించింది. క్రిమినల్ కేసులు దర్యాప్తు జరుగుతోన్న సమయంలో పోలీసులు అనుసరిస్తోన్న విధివిధానాలకు సంబంధించి దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. ఈ సమయంలో ధర్మాసనం పలు ప్రశ్నలను లేవనెత్తింది. ఎన్‌కౌంటర్ల విషయంలో 'పీయూసీఎల్ వర్సెస్ స్టేట్ ఆఫ్ మహారాష్ట్ర' కేసులో (2014నాటి తీర్పులో) స్పష్టత వచ్చినప్పటికీ.. మీడియా సమావేశాలపై మాత్రం స్పష్టత రాలేదు. ఇదే విషయాన్ని సుప్రీం ధర్మాసనం తాజాగా ప్రస్తావించింది. ఎలక్ట్రానిక్ మీడియా రిపోర్టింగ్ విస్తరణ, ప్రాధాన్యత పెరుగుతోన్న క్రమంలో ఈ అంశం ఎంతో ప్రాముఖ్యత సంతరించుకుందని ధర్మాసనం పేర్కొంది. ముఖ్యంగా ప్రజాప్రయోజనాల విషయంలో ఇందులో ఎన్నో అంశాలు ఇమిడి ఉన్నాయని చెప్పింది. దర్యాప్తు విషయాలు ప్రజలు తెలుసుకునే హక్కు, పోలీసులు వెల్లడించే అంశాలు దర్యాప్తుపై ప్రభావం, నిందితుల గోప్యత.. ఇలా మొత్తంగా న్యాయవ్యవస్థపై ప్రభావం వంటి అంశాలతో ముడిపడి ఉందని తెలిపింది. కొన్ని సంవత్సరాలుగా క్రిమినల్ కేసుల్లో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా రిపోర్టింగ్ గణనీయంగా పెరిగిన నేపథ్యంలో.. గతంలో రూపొందించిన

(2010లో) నిబంధనలను అప్‌డేట్ చేయాల్సిన అవసరం ఉందని సుప్రీం ధర్మాసనం స్పష్టం చేసింది. మీడియాకు వెల్లడించే సమాచారం.. పరిస్థితులకు అనుగుణంగా నిర్దిష్టంగా ఉండాలని, బాధితుల వయసు, జెండర్‌తోపాటు నిందితుల గోప్యతను పరిగణనలోకి తీసుకోవాలని సూచించింది. ఇదే సమయంలో పోలీసులు వెల్లడించే సమాచారం 'మీడియా ట్రయల్స్'కు దారితీయకుండా ఉండాలని సుప్రీం ధర్మాసనం స్పష్టం చేసింది. తదుపరి విచారణ జనవరి రెండో వారానికి వాయిదా వేసింది.

పార్లమెంటు ప్రత్యేక సమావేశాల అజెండా విడుదల

న్యూఢిల్లీ : ఈ నెల 18 నుంచి 22 వరకు ప్రత్యేక పార్లమెంటు సమావేశాల అజెండాను బుధవారం కేంద్రం ప్రకటించింది. ఈ సమావేశాల అజెండా ఏమిటో ఇంతవరకు వెల్లడించకపోవడంపై ప్రతిపక్షాలు ఆందోళన వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో తాజాగా నాలుగురోజుల ముందు కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ సమావేశాల అజెండా వెల్లడించింది. ఈనెల 18న ప్రారంభమయ్యే తొలి రోజు సమావేశాల్లో 75 ఏళ్ల పార్లమెంటరీ ప్రయాణంపై చర్చించనున్నట్టు లోక్‌సభ, రాజ్యసభ సచివాలయాలు వేర్వేరుగా బులెటిన్లు విడుదల చేశాయి. కేంద్ర ఎన్నికల ప్రధాన అధికారి, ఎన్నికల కమిషనర్ల నియామకాలను నియంత్రించేలా కేంద్రప్రభుత్వం కొత్త బిల్లును ఆగస్టు 10న రాజ్యసభ లో ప్రవేశపెట్టింది. నియామక ప్యానెల్‌లో ప్రధానమంత్రి, లోక్‌సభలో ప్రతిపక్ష నేత, ప్రధాని నామినేట్ చేసిన కేంద్ర కేబినెట్ మంత్రి ఒకరు సభ్యులుగా ఉంటారని బిల్లులో పేర్కొన్నారు. కమిటీ నుంచి సీజేఐను తొలగించనున్నట్టు చెప్పడంతో ఈ నియామక ప్రక్రియ వివాదాస్పదమైంది. ఆ బిల్లుతో కలిపి నాలుగు ముఖ్యమైన బిల్లులను ప్రభుత్వం ఆమోదించే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. ద అడ్వొకేట్స్ (సవరణ) బిల్లు, ద ప్రెస్ అండ్ రిజిస్ట్రేషన్ ఆఫ్ పీరియాడికల్స్ బిల్లుల గురించి చర్చిస్తారని సమాచారం.

సెబీ కేసులో జోక్యానికి అనుమతించండి

సుప్రీంను కోరిన అదానీ మాజీ కాంట్రాక్టర్
నగదు బదిలీ వ్యవహారాలు తనకు తెలుసునని నివేదన

ముంబయి : హిండెన్‌బర్గ్-అదానీ వివాదం మరో మలుపు తిరిగింది. సెబీ-అదానీ వ్యవహారంలో జోక్యం చేసుకునేందుకు తనను అనుమతించాలంటూ అదానీ వద్ద గతంలో కాంట్రాక్టర్‌గా పనిచేసిన అజయ్ కుమార్ అగర్వాల్ సుప్రీంకోర్టును అభ్యర్థించారు. అదానీకి చెందిన సర్గుజా రైల్ కారిడార్ ప్రాజెక్టుకు ఈబీపీఎల్ వెంచర్స్ సంస్థ ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్‌గా వ్యవహరించింది. ఆ సంస్థలో అగర్వాల్ డైరెక్టర్‌గా కొనసాగుతున్నారు. అదానీ గ్రూపులోని కంపెనీల పనితీరును తాను నిశితంగా పరిశీలించానని, కాబట్టి పెట్టుబడి దారుల విశాల ప్రయోజనాలను కాపాడే నిమిత్తం సుప్రీంకోర్టుకు సాయపడేందుకు అనుమతించాల ని ఆయన తన పిటిషన్‌లో కోరారు. తాను చేసిన పనికి సొమ్ము చెల్లించడం కోసం ఒక అనుబంధ కంపెనీ నుండి మరో అనుబంధ కంపెనీకి డబ్బును బదిలీ చేశారని అందులో వివరించారు. అగర్వాల్ పిటిషన్‌లోని వివరాల ప్రకారం.... సర్గుజా రైల్ కారిడార్ నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు అదానీ గ్రూపు సర్గుజా రైల్ కారిడార్ ప్రైవేట్ లిమిటెడ్ (ఎస్ఆర్‌సీపీఎల్) పేరిట ఓ కంపెనీని ఏర్పాటు చేసింది. చండీఘర్‌లో ప్రాజెక్టును చేపట్టేందుకు ఎస్ఆర్‌సీపీఎల్‌కు ఈపీసీ కాంట్రాక్ట్ లభించింది. ఆ పనులను తర్వాత ఈబీపీఎల్ వెంచర్స్‌కు సబ్-కాంట్రాక్ట్ ఇచ్చారు. ఈ సంస్థే ప్రాజెక్ట్ పనులు పూర్తి చేసింది. ఎస్ఆర్‌సీపీఎల్ తరపున పనిచేసిన సమయంలో అగర్వాల్ ఆ సంస్థ పని సంస్కృతిని నిశితంగా పరిశీలించారు. 2022లో ఎస్ఆర్‌సీపీఎల్‌ను అదానీ పోర్ట్ కంపెనీ కొనుగోలు చేసింది. ఈ సంస్థలో ఎస్ఆర్‌సీపీఎల్ రూ. 450 కోట్లు కానీ లేదా ఓడరేవు నిర్వాహకుడి ఏకీకృత నిర్వహణ లాభంలో ఐదు శాతం కానీ జమ చేస్తుందని అదానీ పోర్ట్ తెలిపింది. ఇదిలావుండగా అదానీ గ్రూప్ కంపెనీలు నిధులను దారిమళ్లించే అవకాశం ఉన్నదని, వాటాల విలువ ను తారుమారు చేసే ప్రమాదం ఉన్నదని 2014లో చేసిన హెచ్చరిక ను సెబీ గోప్యంగా ఉంచిందని ఈ నెల 8న సుప్రీం కోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లో అనామికా జైస్వాల్ తెలియజేశారు. అవకతవకల కు పాల్పడడం ద్వారా సంపాదించిన సొమ్మును దుబాయ్, మారిషస్‌లలోని సంస్థల ద్వారా అదానీ తన లిస్టెడ్ కంపెనీలలో పెట్టుబడి పెట్టారని, ఆ విషయాన్ని కూడా సెబీ దాచిపెట్టిందని జైస్వాల్ వివరించారు. అదానీ గ్రూపులో అవకతవకలు జరిగాయని, వాటాల విలువను ఎక్కువ చేసి చూపారని అమెరికాకు చెందిన హిండెన్‌బర్గ్ సంస్థ చేసిన ఆరోపణల పై విచారణ జరపాల్సిందిగా జనవరిలో సెబీని సుప్రీంకోర్టు ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారంపై తాను జరిపిన విచారణ పూర్తయిందంటూ ఆగస్ట్ 25న సుప్రీంకోర్టుకు సెబీ నివేదిక సమర్పించింది.

కెనరా బ్యాంక్ Canara Bank (భారత ప్రభుత్వరంగ సంస్థ) | సిండికేట్ Syndicate
విజయవాడ మెయిన్ బ్రాంచ్ (13340), విజయవాడ, ఆంధ్రప్రదేశ్. ✆ 0866-2567779, 9440905155

సెక్షన్ 13(4) **స్వాధీనత ప్రకటన** (స్థిరాస్తి కొరకు)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (చట్టం 54, 2002) ప్రకారం **కెనరా బ్యాంక్** యొక్క అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు సెక్షన్ 13 (12) కు అనుబంధమైన సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని 3వ నిబంధన ప్రకారం సంక్రమించిన అధికారాలను వినియోగించి **ఋణగ్రహీత(లు): శ్రీ దమ్మలపాటి శ్యామల మరియు శ్రీ డి హృదయ్ కుమార్** వారిని నోటీసులో ఉదహరించబడిన బకాయి సొమ్ము **రూ. 29,79,517.86 (అక్షరాల ఇరవై తొమ్మిది లక్షల డభ్భై తొమ్మిది వేల ఐదు వందల పదిహేడు రూపాయలు మరియు ఎనభై ఆరు పైసలు),** మొత్తంను నోటీస్ అందిన తేది నుండి 60 రోజుల లోపు చెల్లించవలసినదిగా తేది **31.05.2023 న డిమాండ్ నోటీసును జారీచేయడమైనది.**

ఋణగ్రహీత సదరు బకాయిసొమ్మును చెల్లించుటలో విఫలమైనందున, దిగువ సంతకందారు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని సెక్షన్ 13(4) కు అనుబంధమైన సదరు రూల్ 8 & 9 ప్రకారము సంక్రమించిన అధికారములను వినియోగిస్తూ దిగువ వివరించిన ఆస్తిని **12-09-2023వ తేదీన స్వాధీనపరచుకున్నారని** ఋణగ్రహీతలు, హామీదారులు మరియు యావన్మంది ప్రజానీకమునకు ఇందుమూలముగా తెలియజేయడమైనది.

ప్రత్యేకముగా ఋణగ్రహీతలు, హామీదారులు మరియు ప్రజానీకమును హెచ్చరించునది ఏమనగా ఈ ఆస్తి విషయమై ఎవ్వరూ ఎటువంటి లావాదేవీలు జరుపరాదని, ఒకవేళ లావాదేవీలు జరిపిన అవి **కెనరా బ్యాంక్, విజయవాడ మెయిన్ బ్రాంచ్** వారికి తేది. 12.09.2023 నాటికి చెల్లించవలిసిన బకాయి **రూ. 30,37,542.09** + వడ్డీ కలిపి మొత్తమునకు లోబడిపుంటాయి.

సెక్షన్ 13, సబ్-సెక్షన్(8) చట్ట ప్రకారము ఋణగ్రహీత'లు తమ తనఖా ఆస్తులను విడిపించుకోవటానికి ఉన్న కాలవ్యవధిని వినియోగించుకోగలరని సూచించడమైనది.

స్థిరాస్తి వివరములు:

ఐటమ్ నెం-1: కృష్ణా జిల్లా, ఇబ్రహీంపట్నం మండలం, ఇబ్రహీంపట్నం ఎస్‌ఆర్‌ఓ, గుంటుపల్లి గ్రామ పంచాయితీ మరియు గ్రామం, సమీప డోర్ నెం. 3-53, సర్వే నెం. 238/1, కలిగిన మొత్తం 4767.4 చ।గ।।ల లేదా 3986.166 చ।మీ।।లో అవిభాజ్యపు 46.07 చ।గ।। లేదా 38.771 చ।మీ।। వాటా విస్తీర్ణం గల భూమి. **హద్దులు:** తూర్పు: పచ్చల చంద్రశేఖర్ కొంత ఆస్తి మరియు రోడ్డు భాగం, దక్షిణం: మరుపూడి విష్ణువర్ధన్ రావు మరియు ఇతరుల ఆస్తి, పడమర: మరుపూడి సుధర్మ ఆంజనేయులు మరియు కుమారుల ఆస్తి, ఉత్తరం: మరుపూడి అన్నపూర్ణాదేవి మరియు ఇతరుల ఆస్తి.

ఐటమ్ నెం-2: పైన తెలిపిన ఐటమ్ నెం. 1 స్థలంలో నిర్మించిన ''అంజన గ్రీన్ పార్కు'', 1వ అంతస్తులో ప్లింత్ ఏరియా 855 చ।।అ।।, కామన్ ఏరియా 114 చ।।అ।।, స్టిల్ట్ ఫ్లోర్‌లో 100 చ।।అ।। పార్కింగ్ ఏరియా గల ఫ్లాట్ నెం. 218. అన్ని ఈజ్‌మెంటరీ హక్కులు, ఉమ్మడి ఏరియాలు మరియు ఉమ్మడి సౌకర్యాలు మరియు మొయింటినెన్స్ కొరకు చెల్లింపులు, అపార్ట్‌మెంట్ అసోసియేషన్‌కు చెల్లించే రిపేరింగ్ ఛార్జీలు, ఉమ్మడి ఉపయోగ హక్కులుతో సహా యావత్తు. హద్దులు: తూర్పు: ఉమ్మడి వరండా, దక్షిణం: శూన్యాకాశం, పడమర: ఉమ్మడి వరండా, ఉత్తరం: శూన్యాకాశం.

తేది: 12.09.2023 ప్రదేశం: విజయవాడ
సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

కెనరా బ్యాంక్ Canara Bank (భారత ప్రభుత్వరంగ సంస్థ) | సిండికేట్ Syndicate
గుంటుపల్లి బ్రాంచ్ (13753), 6/4, NH 9, జయప్రదనగర్, డాన్ బాస్కో స్కూల్ ఎదురుగా, గుంటుపల్లి-521241.

సెక్షన్ 13(4) **స్వాధీనత ప్రకటన** (స్థిరాస్తి కొరకు)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (చట్టం 54, 2002) ప్రకారం **కెనరా బ్యాంక్** యొక్క అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు సెక్షన్ 13 (12) కు అనుబంధమైన సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని 3వ నిబంధన ప్రకారం సంక్రమించిన అధికారాలను వినియోగించి **ఋణగ్రహీత(లు): శ్రీ ఘయాస్ మొహిద్దున్ షేక్ మొహమ్మద్ (మెట్రో సిమెంట్ ట్రేడర్స్ (ప్రొప్రయిటర్) మరియు శ్రీమతి హలిమా బీ మొహమ్మద్** వారిని నోటీసులో ఉదహరించబడిన బకాయి సొమ్ము అకౌంట్ నెం. 37539150000016 & 37531400000257 క్రింద **రూ. 25,41,055.42 (అక్షరాల ఇరవై ఐదు లక్షల నలభై ఒక్క వేల యాభై ఐదు రూపాయలు మరియు నలభై రెండు పైసలు) మరియు 5,29,399.47 (అక్షరాల ఐదు లక్షల ఇరవై తొమ్మిది వేల మూడు వందల తొంభై తొమ్మిది రూపాయలు మరియు నలభై ఏడు పైసలు)** మొత్తంను నోటీస్ అందిన తేది నుండి 60 రోజుల లోపు చెల్లించవలసినదిగా తేది **02.05.2023 న డిమాండ్ నోటీసును జారీచేయడమైనది.**

ఋణగ్రహీత సదరు బకాయిసొమ్మును చెల్లించుటలో విఫలమైనందున, దిగువ సంతకందారు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని సెక్షన్ 13(4) కు అనుబంధమైన సదరు రూల్ 8 & 9 ప్రకారము సంక్రమించిన అధికారములను వినియోగిస్తూ దిగువ వివరించిన ఆస్తిని **12-09-2023వ తేదీన స్వాధీనపరచుకున్నారని** ఋణగ్రహీతలు, హామీదారులు మరియు యావన్మంది ప్రజానీకమునకు ఇందుమూలముగా తెలియజేయడమైనది.

ప్రత్యేకముగా ఋణగ్రహీతలు, హామీదారులు మరియు ప్రజానీకమును హెచ్చరించునది ఏమనగా ఈ ఆస్తి విషయమై ఎవ్వరూ ఎటువంటి లావాదేవీలు జరుపరాదని, ఒకవేళ లావాదేవీలు జరిపిన అవి **కెనరా బ్యాంక్, గుంటుపల్లి బ్రాంచ్** వారికి తేది. 12.09.2023 నాటికి చెల్లించవలిసిన బకాయి **రూ. 24,62,742.14 & రూ. 5,13,166.46** + వడ్డీ కలిపి మొత్తమునకు లోబడిపుంటాయి.

సెక్షన్ 13, సబ్-సెక్షన్(8) చట్ట ప్రకారము ఋణగ్రహీత'లు తమ తనఖా ఆస్తులను విడిపించుకోవటానికి ఉన్న కాలవ్యవధిని వినియోగించుకోగలరని సూచించడమైనది.

స్థిరాస్తి వివరములు:

కృష్ణా జిల్లా, ఇబ్రహీంపట్నం సబ్-రిజిస్ట్రీ, గుంటుపల్లి గ్రామ పంచాయితీ మరియు గ్రామం, ఎల్.పి.నెం. 26/88, ఆర్.ఎస్. నెం. 117, ప్లాట్ నెం. 37 లోని మొత్తం 272 చ।గ।। లేదా 227.427 చ।మీ।। అవిభాజ్యపు ఉమ్మడి వాటా 42 చ।గ।। లేదా 35.117 చ।మీ।। విస్తీర్ణం గల భూమి. **హద్దులు:** తూర్పు: గోగినేని సత్యనారాయణ భూమి, దక్షిణం: చెన్నుపాటి వెంకట పార్వతి ప్లాట్ నెం 38 స్థలం, పడమర: 33.0 అ।। వెడల్పు రోడ్డు, ఉత్తరం: కోటిపల్లి వెంకటేశ్వరరావు ప్లాట్‌నెం 36 స్థలం. పైన తెలిపిన స్థలంలో నిర్మించిన ''దుర్గా రెసిడెన్సీ'', 1వ అంతస్తులో ప్లింత్ ఏరియా 715.22 చ।।అ।। (బాల్కనీలు కలుపుకొని), 88.88 చ।।అ।। ఉమ్మడి ఏరియా, 120.0 చ।।అ।। కారు పార్కింగ్ ఏరియా గల ఫ్లాట్ నెం. 202 అన్ని సౌకర్యాలతో. హద్దులు: తూర్పు: శూన్యాకాశం, దక్షిణం: శూన్యాకాశం, పడమర: ఉమ్మడి వరండా, లిఫ్ట్ మరియు మెట్లు, ఉత్తరం: శూన్యాకాశం.

తేది: 12.09.2023 ప్రదేశం: గుంటుపల్లి
సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

దక్షిణమధ్య రైల్వే
మమ్మల్ని @SCRailwayindia ద్వారా అనుసరించండి. ద.మ రైల్వేలోని టెండరు ప్రకటనల వివరాలు మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.in లో చూడవచ్చు.

తేదీ: 12.09.2023 డివై.సిఇ/జిఎస్/ఎన్‌ఎస్/27మరియు23/2028/ఓఐ

PUB1039

భారత రాష్ట్రపతి మరియు దిగువసంతకందారుడు తరపున 06.10.2023, 14.00గం. వరకు క్రింద పేర్కొన్న పనుల కొరకు ఇ-టెండర్లను ఆహ్వానించడమైనది.

1. ఇ టెండర్ నం.27-జిఎస్-ఎన్‌ఎస్-23-ఓటి, పని పేరు : ఎన్‌డబ్ల్యూ-1 : టిడియు వై కనెక్టివిటీ-ఎర్త్ వర్క్ ఇన్ ఫార్మేషన్, కొత్త వంతెనల నిర్మాణం మరియు ఇప్పటికే ఉన్న వంతెనల పొడిగింపు, బిజి ట్రాక్‌ను వేయడం మరియు లింక్ చేయడం, పాయింట్లు మరియు క్రాసింగ్‌ల అసెంబ్లింగ్ మరియు చొప్పించడం, రాతి బ్యాలస్టింగు సరఫరా చేయడం, నడిపించడం మరియు డంపింగ్ చేయడం, స్టేషన్ భవనం నిర్మాణం, ప్లాట్‌ఫారమ్ నిర్మాణం, పొడిగింపు మరియు, ఎల్‌సి గేట్‌ను మార్చడం మరియు తాండూరు స్టేషన్‌లో ప్రతిపాదిత వై కనెక్టివిటీ కోసం సిమెంట్ కార్పొరేషన్‌కు వాడి చివర ప్రారంభ లిమిటెడ్ లైన్ మరియు లూప్ లైన్ ఏర్పాటు కోసం ఇతర పనులు. ఎన్‌డబ్ల్యూ-2 : వికెబి-ఎన్‌ఎస్‌పిడి న్యూ ఎక్సింగ్ స్టేషన్ -ఎర్త్ వర్క్ ఇన్ ఫార్మేషన్, వికారాబాద్ మరియు సదాశివపేట స్టేషన్ల మధ్య ప్రతిపాదిత కొత్త క్రాసింగ్ స్టేషన్ కొరకు ఇతర పనులు మరియు షెల్టా ఫార్మ్ నిర్మాణం, స్టేషన్ భవనం నిర్మాణం, స్టోన్ బల్లస్ట్ డంప్లింగ్ మరియు ఇప్పటికే ఉన్న వంతెన పొడిగింపు, బిజి ట్రాక్‌ను వేయడం మరియు లింక్ చేయడం, పాయింట్లు మరియు క్రాసింగ్‌ల అసెంబ్లింగ్ చేయడం మరియు చొప్పించడం, సరఫరా చేయడం, నడిపించడం. సుమారు టెండర్ విలువ రూ.లో : 28,22,64,220/-, ఇఎమ్‌డి : రూ.15,61,300/-, పూర్తి వ్యవధి నెలల్లో : 18 నెలలు, నిర్వహణ వ్యవధి నెలల్లో : 36 నెలలు.

2. ఇ టెండర్ నం.: 28-జిఎస్-ఎన్‌సి-23-ఓటి, పని పేరు : ఎన్‌సి డివిజన్/గాంధి శక్తి యూనిట్ : బిపిక్యూ-కెజెడ్‌జి సెక్షన్-పిడిపిఎల్ : పెద్దపల్లి-కరీంనగర్ లైన్ కు ఖాజీపేట-బల్లార్ష మెయిన్ లైన్ కనెక్షన్ కొరకు పెద్దపల్లి వద్ద ప్రతిపాదిత బిజి ట్రాక్‌ను వేయడం మరియు లింక్ చేయడం, పాయింట్లు మరియు క్రాసింగ్‌లు, ఎస్‌ఇజెలు మరియు జిజెలు మొదలైన వాటి అసెంబ్లింగ్ మరియు చొప్పించడం, రాతి బ్యాలస్టింగు సరఫరా చేయడం, నడిపించడం మరియు డంపింగ్ చేయడం, ఇప్పటికే ఉన్న ట్రాక్ మరియు పాయింట్లు మరియు క్రాసింగ్‌లను విడదీయడం మరియు వధించడం, నిర్మాణంలో ఎర్త్‌వర్క్, ఫ్లాంకెటింగ్, నిర్మాణం వంతెనలు (2 సంఖ్యలు), కనీస ప్రయాణీకుల సౌకర్యాలతో కొత్త స్టేషన్ బిల్డింగ్ నిర్మాణం మరియు కొత్త బైపాస్ లైన్ కోసం ఇతర పనుల అమలు. సుమారు టెండర్ విలువ రూ.లో : 10,62,42,738/-, ఇఎమ్‌డి : రూ.6,81,200/-, పూర్తి వ్యవధి నెలల్లో : 12 నెలలు, నిర్వహణ వ్యవధి నెలల్లో : 36 నెలలు.

1. టెండర్‌దారులు ఇ-టెంటరింగ్ ద్వారా మాత్రమే పాల్గొనాలి మరియు మాన్యువల్ ఆఫర్లు ఏవీ పరిగణించబడవు. 2. భావి టెండరర్లందరూ ఆన్‌లైన్ చెల్లింపుల ద్వారా మాత్రమే ఇఎమ్‌డి చెల్లించాలని అభ్యర్థించడమైనది.
3. ఏ విధమైన కారణం చెప్పకుండానే టెండర్‌ను రద్దు చేసే హక్కు రైల్వే కు ఉంది.
4. భావి టెండరర్లందరూ జిఎస్‌టిఐఎన్ గుర్తింపు నం.లు. పొందాలని మరియు వారి ఆఫర్‌తో పాటు సమర్పించాలని సూచించబడ్డారు.

డివై.చీఫ్ ఇంజనీర్/గాంధి శక్తి/ సికింద్రాబాద్

ఇ టెండర్ నోటీసు ఆహ్వానం (http://ireps.gov.in ద్వారా)

PUB1040

భారత రాష్ట్రపతి మరియు చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ (కన్‌స్ట్రక్షన్), సౌత్ సెంట్రల్ రైల్వే, సికింద్రాబాద్ తరపున టెండరింగ్‌లో సింగ్ల్ పాకెట్ సిస్టమ్ లో క్రింది వనుల కొరకు ఇ-టెండర్లను ఆహ్వానించడమైనది.

1. నిట్ నం.: టెండర్ నం.11-2023-2024-ఇ-జిఎస్-సిఎన్-బిజెడ్ఎ పని పేరు : ఎలక్ట్రికల్ కన్‌స్ట్రక్షన్/బిజెడ్ఎ : సికింద్రాబాద్ డివిజన్-ఖాజీపేట మరియు విజయవాడ సెక్షన్-కాజీపేట-కొండపల్లి స్టేషన్ల మధ్య విద్యుదీకరణతో కొత్త బిజి మూడవ లైన్ (202.15 కిమీలు): స్టేషన్ భవనాలు మరియు ఆర్‌బిజిఇ గదులు, ప్లాట్‌ఫారమ్‌లు మరియు సర్కులేటింగ్ ప్రాంతాలు, ఎండ్ గూమ్టీలు, గేట్ లాడ్జీలు, ఎస్‌ఐ/ఎస్‌ఎస్‌పిలు, బోసకల్లు మరియు దొర్నకల్ జంక్షన్ స్టేషన్‌ల మధ్య టవర్ కార్ షెడ్‌లకు విద్యుత్ ఏర్పాట్లు మధిర స్టేషన్‌లో స్టాఫ్ క్వార్టర్స్ మరియు ఇతర సర్వీస్ భవనాలు అంటే ఓఆర్‌హెచ్, ట్రాక్ మెషిన్ సిబ్బంది విశ్రాంతి గది, ఎడిఇఎన్ కార్యాలయం మొదట్లైనవి. అంచనా విలువ : రూ.5,59,74,008.52/-, ఇఎమ్‌డి : రూ.429900/-, టెండర్ డాక్యుమెంట్ ఖరీదు : లేదు, పూర్తి వ్యవధి : 12 (పన్నెండు) నెలలు, ముగింపు తేది : 04.10.2023, 15.00 గం.

1. బిడ్ డాక్యుమెంట్ మరియు ఇతర వివరాల కొరకు దయచేసి వెబ్‌సైట్ http://ireps.gov.in లాగిన్ అవ్వండి.
2. ధరవాత్సు డిపాజిట్ మొత్తం మరియు టెండర్ డాక్యుమెంట్ ఖరీదు చెల్లింపులు ఐరెప్స్‌లో నెట్ బ్యాంకింగ్/గేట్‌వే సౌకర్యం ద్వారా మాత్రమే ఆన్‌లైన్ లో అందుబాటులో కలవు.
3. టెండర్లు తమ ఆవర్ధనను ఆన్‌లైన్‌లో సమర్పించవచ్చు టెండర్ వ్యవధి కాలం ముగింపుకు పదిహేను రోజుల ముందు సమర్పించాలి.
4. ఏదైనా సవరణ కొరకు (ఆన్‌లైన్‌లో మాత్రమే జారీ చేయబడుతుంది) టెండర్ సమర్పణ కాలం ప్రారంభం వరకు టెండరర్లు చూసుకోవాలి.

డివై.చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్/కన్‌స్ట్రక్షన్/ విజయవాడ

A1440

తదుపరి టెండర్ నియమాలు/వివరాలు మరియు టెండర్ డాక్యుమెంట్ల డౌన్‌లోడ్ కోసం దయచేసి వెబ్‌సైట్ https://www.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.inని సందర్శించండి.

ఆగని స్కిల్ ప్రకంపనలు

(మొదటి పేజీ తరువాయి)

వాదిస్తున్న సుప్రీంకోర్టు లాయర్ సిద్ధార్థ లూథ్రా గురుగోవింద్ సింగ్ సూక్తులను ప్రస్తావిస్తూ ' అన్ని ప్రయత్నాలు చేసినా...న్యాయం కనుచూపుమేరలో లేకపోతే కత్తిపట్టడమే సరైన పోరాటం' అంటూ చేసిన ట్వీట్ చర్చనీయాంశమైంది. ఈ ట్వీట్ చేసిన తరువాత రాజమహేంద్రవరంలోని సెంట్రల్ జైలులో చంద్రబాబును ఆయన కలిశారు. మరోవైపు ప్రముఖ సినీ నటుడు, తమిళ సూపర్ స్టార్ రజనీకాంత్ లోకేశ్‌ను ఫోన్‌లో పరామర్శించారు. 'చంద్రబాబు నా ఆత్మీయ మిత్రుడు. ఆయన ఎప్పుడు తప్పు చేయడు' అని రజనీకాంత్ అన్నట్లు టిడిపి వర్గాలు చెప్పాయి. బాబు హయంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమమే ఆయన్ను రక్షిస్తుందని, ధైర్యంగా ఉండాలని లోకేష్‌కు ఆయన చెప్పినట్లు ఆ వర్గాలు తెలిపాయి.

5,300కు చేరిన లిబియా వరద మృతులు

ట్రిపోలీ : లిబియాలో భారీ వర్షాలు, వరదలు సృష్టించిన బీభత్సంలో 5,300 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో పది వేల మందికి పైగా ప్రజల ఆచూకీ తెలియడం లేదు. వర్షాల కారణంగా రెండు ఆనకట్టలు కూలిపోయాయి. తూర్పు ప్రాంతంలోని డెర్నా నగరం నీట మునిగింది. అల్‌మర్జ్, సుసాహ్, షాహత్, అల్ బేడా నగరాలలో కూడా భారీగా ప్రాణనష్టం జరిగింది. ఇరవై వేల మందికి పైగా ప్రజలు సర్వం కోల్పోయి నిరాశ్రయులయ్యారు. సుమారు 90 వేల జనాభా కలిగిన డెర్నా నగరానికి దారితీసే రహదారులన్నీ వరదల కారణంగా దెబ్బతినడంతో సహాయ బృందాలు చేరుకోవడం కష్టమవుతోంది. రాజకీయ విభజనల కారణంగా 2014లో లిబియా రెండుగా చీలిపోయింది. అంతర్జాతీయ గుర్తింపు పొందిన ప్రభుత్వం త్రిపోలీలో ఉండగా, డెర్నా సహా తూర్పు ప్రాంతం మరో అధికార వ్యవస్థ అధీనంలో ఉంది. దీంతో ఆ ప్రాంతంలో మ

మీకోసం

చేపముక్కలకు కొద్దిగా ఉప్పు కలిపి డీప్‌ఫ్రిజ్‌లో ఉంచితే ఒకదానికొకటి అంటుకోకుండా ఉంటాయి.

జీవన సౌరభం

ఓడిపోతున్న క్షణంలోనూ పోరాడేవాడే నిజమైన ధైర్యవంతుడు.

మార్పు

ఖానంపల్లి అనే గ్రామంలో లక్ష్మీరాజం అనే రైతు ఉన్నాడు. ఆయన భార్య పేరు రాజమణి. వారికి ఇద్దరు ఆడపిల్లలు. ఆ రైతు నేలను నమ్ముకొని, వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నాడు. కూతుర్లను ఎంతో ప్రేమతో పెంచుతున్నాడు. వ్యవసాయంలో ఎన్ని ఇబ్బందులు గురైనా ఆ కష్టాన్ని వారికి తెలియనిచ్చేవాడు కాదు. తల్లిదండ్రులు తిన్నా, తినకపోయినా పిల్లలకు మాత్రం కడుపునిండా అన్నం పెడుతున్నారు. అడిగింది లేదనకుండా కొనిస్తున్నారు. అయితే, తల్లిదండ్రుల కష్టం తెలియని పిల్లలు సరిగా చదివే వారు కాదు. క్లాసులో ఎప్పుడూ వెనుకబడే ఉండేవారు.

ఒక రోజు లక్ష్మీరాజం ఇంటికి బంధువులు వచ్చారు. 'ఈ ఏడాది చేతికి వచ్చిన పంట, వర్షాలు బాగా పడటంతో కొట్టుకు పోయింద'ని వారితో లక్ష్మీరాజం బాధగా చెప్పాడు. పిల్లల చదువు కోసం, తను, తన భార్య పడుతున్న శ్రమను, కష్టాన్ని కూడా చెప్పాడు.

ఆ మాటలను పిల్లలిద్దరూ చాటుగా విన్నారు. ఇన్ని రోజులు తండ్రి తమ కోసం పడుతున్న బాధలు తెలిసి చాలా బాధపడ్డారు. అప్పటినుంచి స్కూలుకు క్రమం తప్పకుండా వెళ్లటం మొదలు పెట్టారు. బాగా చదువుకున్నారు. వ్యవసాయం, ఇంటి పనుల్లో కూడా అమ్మానాన్నకు సాయం చేయడం ఆరంభించారు. పిల్లల్లో వచ్చిన మార్పుకు లక్ష్మీరాజం దంపతులు ఎంతో సంతోషించారు.

– ఏ. శివాణి, 7వ తరగతి,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
నర్సింహుల పల్లి, పెద్దపల్లి జిల్లా.

దారి చూపండి

పిల్లలూ, ఇక్కడ చింటూ, తన కుక్కపిల్ల దగ్గరికి వెళ్లే దారి మర్చిపోయాడు. మీరు చూపించండి.



నేను గీసిన బొమ్మ

షేక్ సుమ్మయ్య,
4వ తరగతి,
ఎంపిపిఎస్ చిల్లకల్లు.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

పల్లె సృజన వెలికితీతలో ...

ఒక అవసరం ఎన్నో కొత్త ఆవిష్కరణలకు బీజం వేస్తుంది అనడానికి మన కళ్ల ముందు ఎన్నో ఉదాహరణలున్నాయి. సాంకేతికతను అందిపుచ్చుకుని నయా ఆవిష్కరణలను రూపొందిస్తారు చాలామంది విద్యావంతులు. కానీ, ఆర్థిక కష్టాలతో అర్ధంతరంగా చదువు ఆపేసిన వడ్రంగి, సిమెంటు పని కార్మికుడు, వెల్డర్, ఎలక్ట్రీషియన్, ప్లంబర్, విత్తనాలు చల్లడం, కోత, కలుపు తీయడం వంటివి చేసే వ్యవసాయ కార్మికులు కూడా కొత్త కొత్త ప్రయోగాలతో ప్రజలకు ఉపయోగపడే నయా ఆవిష్కరణలతో ముందుకు వస్తారంటే చాలామంది నమ్మకపోవచ్చు. కానీ వారిలో సృజనను వెలికితీసి జీవితంలో వారు ఊహించని ఎత్తులకు ఎదిగేలా చేస్తున్నారు సికింద్రాబాద్‌కి చెందిన విశ్రాంత ఆర్మీ అధికారి పి.గణేషమ్. 18 ఏళ్లుగా నిర్విరామంగా ఆయన చేసిన కృషికి 200కి పైగా కొత్త ఆవిష్కరణలు వెలుగులోకి వచ్చాయి. వాటిలో 13కి రాష్ట్రపతి అవార్డులు, రెండింటికి పద్మశ్రీ అవార్డులు కూడా సొంతమయ్యాయి. 'పల్లె సృజన' పేరుతో గణేషమ్ చేస్తున్న ఈ కృషి రెండు తెలుగు రాష్ట్రాల్లో తెలియని వారు లేరు.

గణేశమ్ ఇంటి మొదటి బారులు తీరిన నూతన ఆవిష్కరణలు

మల్లేశమ్

తెలంగాణ భూంపల్లికి చెందిన గణేశమ్ ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్. ఆర్మీలో 35 ఏళ్లు విధులు నిర్వర్తించారు. నూతన ఆవిష్కరణలపై ఆసక్తి ఎక్కువ. సైన్యంలో పనిచేస్తున్నప్పుడు కూడా ఆవిష్కరణల ఆవశ్యకతను నొక్కిచెప్పేవారు. '2005లో 'నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ (ఎన్ఐఎఫ్) అనే హనీబీ నెట్‌వర్క్, ఢిల్లీలో గ్రామీణ ఆవిష్కర్తలు, ఆర్మీ జవాన్లతో అట్టడుగు స్థాయి ఆవిష్కరణలతో ఓ ప్రదర్శన ఏర్పాటు చేశారు. అప్పుడు అక్కడ తెలుగు వారు ఎవరూ కనిపించలేదు. వాలంటీర్లు లేకపోవడం వల్లే ఆ నెట్‌వర్క్ మన రాష్ట్రానికి చేరలేదు. అప్పుడే నిర్ణయించుకున్నాను. దేశానికి తెలుగువారి గ్రామీణ విజ్ఞానాన్ని పరిచయం చేయాల'ని అంటూ తన ప్రయాణ తొలి రోజులను గుర్తుచేసుకున్నారు. 2006లో రిటైర్ట్ అయిన గణేషమ్ రాష్ట్రపతి చేతుల మీదుగా 'విశిష్ట సేవా మెడల్' అవార్డును కూడా అందుకున్నారు.

విశ్రాంత జీవితంలో నూతన ఆవిష్కర్తలకు అండగా నిలిచేందుకు సిద్ధమైన గణేషమ్ 'అందుబాటులో ఉన్న ముడి పదార్థాలతో యంత్రాలు తయారుచేసుకుని చాలామంది తమ పనిని సులువుగా చేయడం నేను గమనించాను. అయితే అవి విక్రయించదగిన స్థితిలో ఉండేవి కావు. సాధారణంగా ఆ ఆవిష్కర్తలు వాటిని విక్రయించేందుకు తయారుచేయరు. కానీ వాటి అవసరం చాలా ఉంది. అది ఇతరులకూ ఉపయోగపడితేనే ఆ ఆవిష్కరణ సజీవంగా ఉంటుంది. అందుకే నేను ఈ ప్రయాణం ప్రారంభించాను. నా దృష్టిలో ఈ ప్రయాణం మరుగున పడివున్న జ్ఞాన దేవాలయాలను సందర్శించడంలా భావిస్తాను' అని అంటున్నప్పుడు ఆయన మాటల్లో ఎంతో సంతృప్తి కనిపిస్తోంది.

ఆవిష్కర్తల్లో కొందరు మల్లేశమ్

సిరిసిల్లకు చెందిన సిహెచ్ మల్లేశమ్ స్కూలు డ్రాపౌట్. పేద నేత కార్మికుడు. అతనికి 'పల్లె సృజన' ఇచ్చిన ప్రోత్సాహంతో 'లక్ష్మీ ఆసు' యంత్రం ఆవిర్భవించింది. ఏకకాలంలో ఆరు చీరలను ఒక్క రోజులో నేయడం ఆ యంత్రం ప్రత్యేకత. చిన్న పరిమాణంలో ఉండే 0.25 హెచ్‌డి మోటారు అమర్చి మల్లేశం సాధించిన ఈ ఘనత అతణ్ణి 'ఫోర్బ్స్' పత్రికలో

చోటు సంపాదించేలా చేసింది. భారత ప్రభుత్వం 2010లో పద్మశ్రీ అవార్డుతో సత్కరించింది. మల్లేశమ్ జీవితం ఆధారంగా ప్రియదర్శి, అనన్య జంటగా 'మల్లేశమ్' అనే చిత్రం కూడా కొన్నాళ్ల కిందట విడుదలై విశేషంగా ఆకర్షించింది.

తన తల్లి పడే కష్టం చూసి పనిలో వెసులుబాటు కోసం మల్లేశమ్ ఓ యంత్రం తయారుచేయడం కోసం సిద్ధమయ్యాడు. అతనికి కావాల్సిన సామగ్రిని 'పల్లె సృజన' అందించింది. ఆ తోడ్పాటు అతన్ని ఎంతో ఎత్తుకు తీసుకెళ్లింది. "లక్ష్మీ ఆసు యంత్రం' ఎంతోమంది నేత కార్మికులకు గొప్ప వరమని, నూతన యంత్రాల ఆవిష్కరణల్లో మల్లేశమ్ విప్లవాన్ని సృష్టించాడ'ని ఫోర్బ్స్ అతన్ని కొనియాడింది.

పాండురంగారావు.. సైకిళ్లు, స్కూటర్లకు పంచర్లు వేసుకుంటూ జీవనం సాగించేవాడు. పదో తరగతితో చదువు ఆపేశాడు. సహజ గాలి సీలెంట్‌తో ట్యూబ్‌లకు హాని కలిగించకుండా మోటారు సైకిళ్లు, ఆటో టైర్లకు పంచర్లు వేసే యంత్రాన్ని తయారు చేశాడు. పంచర్ల షాపులో ఉన్న వస్తువులతోనే దీన్ని సిద్ధం చేసుకున్నాడు. వృథాగా పారేసే వస్తువులతో తయారుచేసిన ఈ పరికరానికి 'ఎయిర్‌సీల్ ట్యూబ్స్ ప్రైవేట్ లిమిటెడ్' పేరుతో గణేషమ్ జాతీయ స్థాయిలో ప్రచారం చేశారు. స్వల్ప కాలంలోనే ఆ యంత్రం విశేష ప్రజాదరణ పొందింది. రంగారావును ప్రత్యేక ఆవిష్కర్తగా నిలబెట్టింది. 2017లో రాష్ట్రపతి అవార్డుకు ఎంపిక చేసింది. ద్రవరూపంలో ఉండే ఈ ట్యూబ్ సీలింగ్ పదార్థాన్ని స్థానిక మార్కెట్లతో పాటు మహారాష్ట్ర, కర్నాటకలో కూడా విక్రయిస్తున్నారు.

'పల్లె సృజన' ఏం చేస్తుందంటే..

'శోధా యాత్ర' పేరుతో 20 నుంచి 40 మంది 'పల్లె సృజన' వాలంటీర్లు గ్రామగ్రామాలకు తిరుగుతారు. రెండు, మూడు రోజులు అక్కడే గడుపుతారు. వ్యవసాయం, ఇతర పనులు చేసుకుంటున్న కార్మికులతో మాట్లాడతారు. యాత్రలో భాగంగా నూతన యంత్రాలతో పనులు చేసుకుంటున్న వారితో ప్రదర్శనలు చేయించడం, పేటెంట్ హక్కులు కల్పించడం, డాక్యుమెంట్ రూపంలో వారి పరిజ్ఞానాన్ని ప్రచారం చేయడం వంటివాటిపై అవగాహన కల్పిస్తారు. అలా ఇప్పటికి 50కి పైగా ఆవిష్కరణలకు మార్కెటింగ్ చేశారు. గణేషమ్, ఆయన బృందం దేశ నలుమూలల్లో వారం వారం ప్రదర్శనలు నిర్వహిస్తారు. 'పల్లె సృజన' పేరుతో నడుపుతున్న పత్రికలో ఆవిష్కర్తల విజయగాథలు ప్రచురిస్తారు. 'ఈ ప్రచురణలు కొత్త అధ్యాయానికి తెరదీస్తున్నాయి. ఎంతోమంది ఆవిష్కర్తలకు స్ఫూర్తినిస్తున్నాయి' అంటున్నారు గణేషమ్.

ఇంకా ఏం చేస్తారంటే..

'పల్లె సృజన' ద్వారా ఎంతోమంది ఆవిష్కర్తలను కలిసిన వాలంటీర్ల బృందం వారు తయారుచేసిన యంత్రాలను మూడు విభాగాలుగా విభజిస్తుంది. 1. అమ్మకానికి సిద్ధంగా ఉంది (ఆర్ఎఫ్ఎస్), 2. వ్యాపారవేత్త కోసం సిద్ధంగా ఉంది (ఆర్ఎఫ్ఇ), 3. నమూనా కోసం సిద్ధంగా ఉంది (ఆర్ఎఫ్పి).

ఇలా విభజించిన యంత్రాలతో ఇప్పటివరకు 2,500 సాంప్రదాయ పద్ధతులను డాక్యుమెంట్ చేశారు. 'ఆవిష్కర్తలందరూ సమిష్టిగా ఇప్పటివరకు రూ.4 కోట్లకు పైగా టర్నోవర్‌ను సృష్టించారు. ఈ ప్రభావం 5 లక్షల పైచిలుకు కుటుంబాలపై ఉంద'ని తన లక్ష్యం గురించి గణేషమ్.గర్వంగా చెబుతున్నారు.

పల్లె విజ్ఞానాన్ని వెలికితీయడంలో ఈ విశ్రాంత జవాను అవలంబిస్తున్న విధానం ఎంతోమందికి మార్గనిర్దేశకంగా ఉంది. ఈ విధంగా మరిన్ని ఆవిష్కరణలు రావాలని ఆశిద్దాం.

సచివాలయ మహిళా పోలీసులకు పదోన్నతులు

●ప్రతిపాదనలు సిద్ధం చేసిన హోంశాఖ

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి – అమరావతి

గ్రామ, వార్డు సచివాలయాల్లో నియమితులైన మహిళా పోలీసులకు పదోన్నతులు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఈ మేరకు హోంశాఖ కూడా ప్రతిపాదనలు సిద్ధంచేసింది. విశ్వసనీయ సమాచారం ప్రకారం ఈ పదోన్నతులు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ స్థాయి వరకు మాత్రమే ఉండనున్నాయి. మహిళా పోలీసులకు సీనియర్ మహిళ పోలీస్‌గా తొలుత పదోన్నతి కల్పిస్తారు. ఈ పదోన్నతికి కనీసం ఆరేళ్లపాటు వారు మహిళా పోలీస్‌గా బాధ్యతలు నిర్వహించాల్సి ఉంటుంది. అలాగే మహిళా పోలీసుగా నియమితులైన సమయంలో నిర్వహించిన పరీక్షల్లో వారు సంపాదించుకున్న మార్కులు, విధి నిర్వహణ సమయంలో వారి పర్ఫార్మెన్స్ వంటి వాటిని కూడా పరిగణలోకి తీసుకుంటారు. సీనియర్ మహిళ పోలీస్ వరకు వారు ఎస్ఐ పరిధిలోనే ఉంటారు.

ఆ తరువాత ఎఎస్ఐగా మదోన్నతి పొంది ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో పనిచేయాల్సి ఉంటుంది. అలాగే తదుపరి పదోన్నతి అయిన ఎస్సై స్థాయిలో డిఎస్పి కార్యాలయంలోనూ, ఇన్‌స్పెక్టర్ పదోన్నతితో జిల్లా ఎస్పీ కార్యాలయంలోనూ పనిచేయాల్సి ఉంటుందని ప్రతిపాదించారు. అన్ని స్థాయిల్లోనూ వారంతా ఆర్గనైజింగ్ విధుల్లో మాత్రమే పనిచేయాల్సి ఉంటుందని ఆ ప్రతిపాదనల్లో పొందుపరిచారు. ఇదే సమయంలో మహిళ పోలీస్‌కు సంబంధించిన జాబ్ ఛార్ట్‌ను కూడా పూర్తి స్థాయిలో తయారుచేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

సజ్జల, సంజయ్‌వి వక్రభాష్యాలు

●మాజీ మంత్రి నక్కా ఆనంద్‌బాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వాస్తవాలు కప్పిపుచ్చి చేసిన తప్పును అడ్డగోలుగా సమర్థించుకోవడానికే ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, సిఐడి డిజి సంజయ్ మీడియా ముందు వక్రభాష్యాలు పలికారని మాజీ మంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు నక్కా ఆనంద్‌బాబు విమర్శించారు. టిడిపి కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. డిజైన్ టెక్ సంస్థ ఎమ్‌డి వాస్తవాలు బయటపెట్టడంతో ప్రభుత్వానికి, సిఐడికి ముచ్చెమటలు పట్టాయని అన్నారు. శిక్షణ కేంద్రాల వివరాలు, పరికరాలు, సాఫ్ట్‌వేర్ కళ్లముందు కనిపిస్తుంటే అవినీతికి స్థానం ఎక్కడుందో సిఐడి డిజి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. జిఓలు 8, 4 ఇచ్చిన అజయ్ కల్లం, ప్రేమచంద్రారెడ్డిని ఎందుకు విచారించరని ప్రశ్నించారు.

భారత్‌తో ఫైనల్లో తలపడేదెవరో !

● పాకిస్తాన్, శ్రీలంక జట్లకు కీలకం
● వర్షంతో మ్యాచ్ నిలిస్తే లంకకు జాక్‌పాట్

కొలంబో: ఆసియాకప్ క్రికెట్ పోటీలు చివరి దశకు చేరుకున్నాయి. మరో రెండు సూపర్-4 మ్యాచ్‌లు మాత్రమే మిగిలి ఉండగా.. పాకిస్తాన్-శ్రీలంక జట్ల మధ్య గురువారం జరిగే మ్యాచ్‌పై అందరి దృష్టి నెలకొంది. ఫైనల్లో భారత్‌తో తలపడే జట్టేదో పాకిస్తాన్, శ్రీలంక జట్ల మధ్య జరిగే మ్యాచ్‌తో తేలిపోనుంది. ఈ రెండు జట్లు సూపర్-4లో బంగ్లాదేశ్‌పై నెగ్గి, భారత్ చేతిలో ఓటమిపాలయ్యాయి. పాకిస్తాన్ జట్టు ఏకంగా 228పరుగుల తేడాతో ఓటమిపాలైతే.. శ్రీలంక జట్టు 41పరుగుల తేడాతో ఓడింది. ఇక బంగ్లాదేశ్‌పై శ్రీలంక జట్టు 21పరుగుల తేడాతో నెగ్గితే.. పాకిస్తాన్ జట్టు బంగ్లా నిర్దేశించిన 192 పరుగుల లక్ష్యాన్ని 3ఓవెకెట్టు కోల్పోయి ఛేదించింది.

సూపర్-4 దశలో ఒక్కో జట్టు.. మిగతా వాటితో మూడేసి మ్యాచ్‌లు ఆడతాయి. ఇందులో టాప్-2లో నిలిచిన జట్టు ఫైనల్ చేరుకుంటాయి. సూపర్-4లో రెండేసి మ్యాచ్‌లు ముగిసిన తర్వాత భారతజట్టు 4పాయింట్లు(+2.69 నెట్‌రన్‌రేట్)తో అగ్రస్థానంలో నిలిచి మరో మ్యాచ్ మిగిలి ఉండగానే ఫైనల్‌కు చేరుకుంది. ఇక శ్రీలంక, పాకిస్తాన్ జట్టు రెండేసి మ్యాచ్‌లు ఆడగా.. ఒక్కో మ్యాచ్‌లో ఓడి.. పాయింట్ల పట్టికలో రెండు, మూడు స్థానాల్లో కొనసాగుతున్నాయి. పాకిస్తాన్.. భారత్‌పై 228పరుగుల భారీ తేడాతో ఓడిపోవడంతో నెట్‌రన్‌రేట్‌పై ప్రభావం పడి.. మూడో స్థానంలో ఉంది. పాకిస్తాన్-శ్రీలంక జట్ల మధ్య జరిగే మ్యాచ్ విజేత సమీకరణాలతో నిమిత్తం లేకుండా నేరుగా భారత్‌తో ఫైనల్‌లో తలపడనుంది. ఇక బంగ్లాదేశ్ ఇప్పటికే రెండింటిలో ఓడి టోర్నీ నుంచి నిష్క్రమించింది. సెప్టెంబర్ 15న భారత్, బంగ్లా మధ్య జరిగే మ్యాచ్ నామమాత్రమే.

వర్షంతో మ్యాచ్ రద్దయితే..

పాక్-శ్రీలంక జట్ల మధ్య కొలంబోలోని ప్రేమదాస స్టేడియంలో జరిగే మ్యాచ్ వర్షంతో రద్దయితే ఇరుజట్లకు ఒక్కో పాయింట్ దక్కనున్నాయి. దీంతో పాకిస్తాన్ కంటే మెరుగైన రన్‌రేట్ కలిగి ఉన్న శ్రీలంక జట్టు ఫైనల్‌కు చేరనుంది. ఎందుకంటే మ్యాచ్ రద్దయితే ఇరుజట్లకు చెరో పాయింట్ లభిస్తే.. 3 పాయింట్లతో ఇరుజట్టు సమానంగా ఉన్నా శ్రీలంక(-0.20), పాకిస్తాన్(-1.89) నెట్ రన్‌రేట్‌తో 2, 3 స్థానాల్లో ఉన్నాయి. అప్పుడు మెరుగైన రన్‌రేట్ కలిగిన శ్రీలంక రెండో స్థానంలో నిలిచి ఫైనల్ చేరుకుంటుంది. మ్యాచ్ జరిగి తప్పక విజయం సాధిస్తేనే పాకిస్తాన్ ఫైనల్‌కు చేరుతుంది. వర్షంతో మ్యాచ్ నిలిస్తే మాత్రం పాక్ ఫైనల్ ఆశలకు ఎదురు దెబ్బ తగిలినట్లే. ఈ క్రమంలో భారత్-పాకిస్తాన్ మ్యాచ్‌కు రిజర్వ్‌డేను ప్రకటించిన ఆసియా క్రికెట్ కౌన్సిల్(ఎసిసి).. ఈ మ్యాచ్‌కు కూడా రిజర్వు డేను ప్రకటించాలని మాజీ క్రికెటర్ల వాదిస్తున్నారు.

అనంత్‌నాగ్‌లో ఉగ్రదాడి

ముగ్గురు భద్రతా సిబ్బంది మృతి ● ఇద్దరు ఉగ్రవాదులు హతం

శ్రీనగర్: జమ్ముకాశ్మీర్‌లో ఉగ్రవాదులు మరోసారి రెచ్చిపోయారు. అనంత్‌నాగ్ జిల్లాలో భద్రతాదళాలపై కాల్పులు జరిపారు. ఈ దాడిలో ఒక ఆర్మీ కర్నల్, మేజర్‌తోపాటు, జమ్మూ పోలీస్‌కు చెందిన డీఎస్పీ స్థాయి అధికారి ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు వెల్లడించారు. అనంత్‌నాగ్ జిల్లాలోని కోకర్‌నాగ్ ప్రాంతంలోని దట్టమైన అడవుల్లో ఉగ్రవాదులు ఈ భీకర దాడులకు తెగబడ్డారు. దీంతో భద్రతా సిబ్బంది కూడా ఎదురు కాల్పులు ప్రారంభించారు. బుధవారం సాయంత్రానికి కూడా కాల్పులు కొనసాగుతున్నాయి.

అనంత్‌నాగ్ జిల్లాలో అటవీ ప్రాంతంలో ఉగ్రవాదులు దాక్కున్నారనే సమాచారంతో భద్రతా దళాలు అప్రమత్తమయ్యాయి. వారిని పట్టుకునేందుకు మంగళవారం రాత్రి ప్రత్యేక ఆపరేషన్ చేపట్టాయి. బుధవారం ఉదయం వరకు ఆపరేషన్ చేపట్టాయి. ఆ సమయంలో భద్రతా దళాలపై ఉగ్రమూకలు దాడులకు తెగబడటంతో పోలీసులు కూడా ఎదురుదాడి జరిపారు. కమాండింగ్ ఆఫీసర్, డీఎస్పీ నేతత్వంలో భారీ ఎన్‌కౌంటర్ కొనసాగింది. అయితే ఈ ఘటనలో రాష్ట్రీయ రైఫిల్స్ యూనిట్‌కు (19ఆర్ఆర్) చెందిన కమాండింగ్ అధికారి మన్‌ప్రీత్ సింగ్, ఆర్మీ మేజర్ మనోజ్ ఆశీష్ ధోన్‌చక్, జమ్ముకాశ్మీర్ పోలీసుకు చెందిన డీఎస్పీ స్థాయి అధికారి హుమన్యూన్ ముజాహిల్ భట్ తీవ్ర గాయాలపాలయ్యారు. వారిని రక్షించేందుకు అదనపు బలగాలు ప్రయత్నించినప్పటికీ.. ఉగ్రవాదులు నుంచి తీవ్ర స్థాయిలో కాల్పులు కొనసాగడంతో వారిని తరలించడం సాధ్యం కాలేదు. దీంతో ముగ్గురు అధికారులు ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు వెల్లడించారు. ఈ ఘటనలో ఇద్దరు ఉగ్రవాదులు కూడా హతమైనట్లు తెలిపారు.

ఉద్దానంలో నిరంతర విద్యుత్ సరఫరాకు చర్యలు

● విశాఖపట్నం సిఎండి పృథ్వీరాజ్

ప్రజాశక్తి – పలాస (శ్రీకాకుళం)

ఉద్దానం ప్రాంతంలో అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరాకు ప్రత్యేక చర్యలు చేపడతామని విశాఖపట్నం విద్యుత్ శాఖ సిఎండి ఐ.పృథ్వీరాజ్ తెలిపారు. పలాస విద్యుత్‌శాఖ కార్యాలయాన్ని బుధవారం ఆయన సందర్శించి, అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్దానం ప్రాంతంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతోందనే ఫిర్యాదులు వచ్చాయని, సమస్యను తెలుసుకునేందుకు వచ్చానని తెలిపారు. ఉద్దానంలో చెట్ల కొమ్మల మధ్య నుంచి విద్యుత్తు లైన్ల సరఫరా అవుతుండడంతో ఈ ఇబ్బంది వస్తోందని, కవర్ కండక్టర్ ద్వారా ఇబ్బంది లేకుండా చేయాలనే ఆలోచనతో చర్యలు చేపడుతున్నామన్నారు. కొత్త సబ్ స్టేషన్లతో పాటుగా ఇంటర్ కనెక్టింగ్ లైన్లు వేసేందుకు 11కె.వి. లైను 302 కిలోమీటర్లు, కవిటి మండలంలో 33 కెవిలైను 28 కిలోమీటర్ల మేర వేసేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఈ సందర్భంగా విభాగాల వారీగా ఉద్యోగుల నుంచి వివరాలు సేకరించారు. అనంతరం కాశీబుగ్గ పద్మనాభపురం సచివాలయాన్ని సందర్శించారు. విద్యుత్ మీటర్లకు ఆధార్ అనుసంధానం చేయాలని, అందుకు సచివాలయం ఉద్యోగులు సహకరించాలని కోరారు. జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఇ ఎల్.దైవప్రసాద్, ఇ.ఇ.జి ప్రసాద్, ఎస్ఎఒపి తాతాచార్యులు, డిఇఇ కృష్ణమూర్తి, ఎఇలు వివేకానంద, నాగభూషణ్, యోగి, గార రాజారావు, విద్యుత్తు ఉద్యోగులు, అధికారులు పాల్గొన్నారు.

మంత్రి పెద్దిరెడ్డికి నిరసన సెగ

● కుప్పంలో బయటపడ్డ అధికార పార్టీ విభేదాలు

ప్రజాశక్తి – శాంతిపురం (చిత్తూరు)

మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి చిత్తూరు జిల్లా శాంతిపురం మండలం మొరసనపల్లి వద్ద నిరసన సెగ తగిలింది. రూ. కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూమిని వైఎస్ఆర్ కాంగ్రెస్ మండల కన్వీనర్ బుల్లెట్ దండపాణి ఆక్రమించుకున్నారని అధికార పార్టీకి చెందిన సర్పంచ్ జగదీష్, ఎంపిటిసి సభ్యులు ఆర్యుగం తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. వారం రోజులుగా ఈ సమస్యపై రెవెన్యూ అధికారులకు, కుప్పం ఇన్‌ఛార్జి ఎమ్మెల్సీ భరత్‌కు విన్నవించుకున్నా ప్రయోజనం లేకపోవడంతో ఈ విషయాన్ని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దృష్టికి తీసుకెళ్లేందుకు మొరసనపల్లి పంచాయతీ మహిళలు రోడ్డుపై బైఠాయించారు. మంత్రితో మాట్లాడే అవకాశం కల్పిస్తామని ఎమ్మెల్సీ భరత్ తెలపడంతో నిరసన విరమించారు. అయితే, మంత్రి కాన్వాయ్ ఆగకుండా వెళ్లిపోవడంతో ఆగ్రహించిన సర్పంచ్, ఎంపిటిసి సభ్యులు ప్రజలతో కలిసి మరోసారి రోడ్డుపై బైఠాయించి ధర్నా చేశారు. రాళ్లబూదుగూరు ఎస్ఐ అక్కడకు చేరుకుని తిరుగు ప్రయాణంలో మంత్రితో మాట్లాడే అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చి నిరసన విరమింపజేశారు. అనంతరం తిరుగు ప్రయాణంలో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మొరసనపల్లి పంచాయతీ సర్పంచ్, ఎంపిటిసి సభ్యులతో మాట్లాడారు. రూ. కోట్ల రూపాయల విలువ చేసే స్థలాన్ని బుల్లెట్ దండపాణి, రామచంద్రన్ ఆక్రమించుకుని భవనాలు నిర్మిస్తున్నారని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఆ స్థలాన్ని ప్రజా అవసరాలకు వినియోగించుకునేందుకు కేటాయించాలని కోరారు. సమస్యను వెంటనే పరిష్కరించాలని కుప్పం ఆర్‌డిఒ, రెవెన్యూ అధికారులకు మంత్రి సూచించారు. ఏదిఏమైనా ఈ ఘటన కుప్పంలోని రెండు గ్రూపుల విభేదాలను బహిర్గతం చేసింది.

జి 77 ప్లస్ చైనా సదస్సుకు క్యూబా ఆతిథ్యం

హవానా : ఈ నెల 15, 16 తేదీల్లో జరగనున్న జి 77 ప్లస్ చైనా సదస్సుకు క్యూబా ఆతిథ్యమిస్తోంది. ప్రస్తుతం జి 77కు క్యూబా అధ్యక్షురాలిగా వుంది. ఈ సమావేశాలకు జరుగుతున్న ఏర్పాట్లను క్యూబా అధ్యక్షుడు మిగ్వెల్ డియాజ్ కానెల్ బెర్ముడెజ్, ప్రధాని మాన్యుయల్ మారెరో క్రూయిజ్‌లు సమీక్షించారు. హవానా కన్వెన్షన్ ప్యాలెస్‌తో సహా సమావేశాలు జరిగే పలు వేదికల వద్ద ఏర్పాట్లు, ఇతర చర్యలను పరిశీలించారు. ఇప్పటికే పలువురు దేశాధినేతలు వస్తున్నట్లు సమాచారం అందింది. ప్రముఖులను స్వాగతించేందుకు జోస్ మార్టి అంతర్జాతీయ విమానాశ్రయం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి ఆంటానియో గుటెరస్ ఇప్పటికే హవానా చేరుకున్నట్లు తెలిపారు. బ్రెజిల్, అర్జెంటైనా, హోండూరస్, సెయింట్ విన్సెంట్, గ్రెనడియన్స్ అధ్యక్ష, ప్రధానులు కూడా వస్తున్నట్లు వర్తమానం పంపారు. 134 దేశాలతో జి 77ను ఏర్పాటు చేశారు. 1971లో క్యూబా ఇందులో చేరింది. 2023లో అధ్యక్ష బాధ్యత లు చేపట్టింది.

గ్రేటర్ నోయిడాలో 120 రోజులుగా ఎఐకెఎస్ ఆందోళన

బారికేడ్లు పగలగొట్టి, గేట్లకు తాళాలు వేసిన రైతులు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఉత్తర్‌ప్రదేశ్‌లోని గ్రేటర్ నోయిడాలో యోగి ఆదిత్యనాథ్ నేతృత్వ బిజెపి ప్రభుత్వ బుల్డోజర్ రాజ్‌కు ఎఐకెఎస్ నాయకత్వంలో రైతులు కృతనిశ్చయంతో ప్రతిఘటించారు. భూసేకర ణకు కేవలం పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ 120 రోజులుగా పోరాటం కొనసాగుతోంది. గ్రేటర్ నోయిడా డెవలప్‌మెంట్ అథారిటీని వేలాది మంది రైతులు బారికేడ్లను బద్దలు కొట్టి రెండు ప్రధాన గేట్లకు తాళాలు వేసి ముట్టడించారు. అయితే రైతులను అడ్డుకోవడానికి పోలీసులు చేసిన ప్రయత్నాలన్నీ విఫలయత్నం అయ్యాయి. ఈ ఆందోళనలో మహిళలు, యువత సమీకరణ, పోరాట బలానికి ప్రధాన కేంద్ర బిందువుగా ఉన్నారు. రైతుల డిమాండ్లపై చర్చల కోసం అధికార యంత్రాంగంపై రైతులు ఒత్తిడి చేశారు. చాలా డిమాండ్లను అధికార యంత్రాంగం మౌఖికంగా అంగీకరించింది. అయితే గురువారం చర్చల లిఖితపూర్వక మినిట్స్‌ను పొందే వరకు పోరాటం కొనసాగించాలని ఎఐకెఎస్ నిర్ణయించింది. ఈ ఆందోళనలో ఎఐకెఎస్ అధ్యక్షులు అశోక్ ధావలే, ఉపాధ్యక్షుడు ఇంద్రజిత్ సింగ్, కోశాధికారి పి కృష్ణప్రసాద్, ఉత్తర్‌ప్రదేశ్ అధ్యక్షుడు భరత్ సింగ్, ఉత్తర ప్రదేశ్ సహాయ కార్యదర్శి దిగంబర్ సింగ్, కేంద్ర కమిటీ నేతలు సభ్యులు పుష్పేంద్ర త్యాగి, మనోజ్ కుమార్, రూపేష్ వర్మ, నిధీష్ విల్లట్, ఐద్వా జాయింట్ సెక్రటరీ ఆశా శర్మ తదితరులు పాల్గొన్నార